



# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక






సంపుటి: 5 సంచిక: 7, పేజీలు - 08

శుక్రవారం, జూన్ 6, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati


# ఉద్యోగులకు 2 డీఏలు

## - తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పింది. రెండు డీఏలు ఇచ్చేందుకు అంగీకరించింది. గురువారం మధ్యాహ్నం నుంచి సుదీర్ఘంగా సమావేశమైన మంత్రివర్గంలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యపై చర్చించారు. వీటితోపాటు మరిన్ని ప్రజాసమస్యలపై సమాలోచనలు జరిపారు. ఒకటి కాదు రెండు కాదు దాదాపు ఐదు గంటల పాటు మంత్రివర్గం సమావేశం జరిగింది. మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను భట్టి విక్రమార్క, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాకు వెల్లడించారు. అందులో ఉద్యోగుల సమస్యలు, వారి డిమాండ్‌లపై చాలా సమయం చర్చించారు. ఇలా చర్చించిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డీఏలు ఇవ్వాలని నిర్ణయించారు. ఒక డీఏ ఇప్పుడు ఇవ్వాలని, మరో డీఏ ఆరు నెలల తర్వాత ఇవ్వబోతున్నారు. మిగతా డిమాండ్‌లపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ అందించిన నివేదిక ఆధారంగా చర్చించారు. ఆరోగ్య భద్రత, పెండింగ్ బిల్లుల విషయంలో కార్యాచరణ త్వరలోనే ప్రకటించనున్నారు. పెండింగ్ బిల్లులకు ప్రతినెలా రూ.700 కోట్లు కేటాయిస్తామన్నారు. చాలా కాలంగా నడుస్తున్న ప్రచారనికి ప్రభుత్వం ఫుల్‌స్టాప్ పెట్టింది. రిటైర్ అయ్యాక పదవీకాలం పొడిగింపు ఉండదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలతోపాటు మెట్రో రెండో విడత విస్తరణపై కూడా చర్చించారు. ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీకి ములుగు జిల్లా ఇంచర్లలో 12 ఎకరాలు కేటాయించారు. డ్వాక్రా సంఘాల సంభ్యులకు ప్రమాద బీమా, లోన్ బీమా చెల్లింపుల కోసం 70 కోట్ల రూపాయలు విడుదల చేయాలని నిర్ణయించారు. గ్రామీణ రోడ్ల ఆధునీకరణకు చర్యలు తీసుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

### కేబినెట్ నిర్ణయాలివే..

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు రెండు డీఏలు ఇచ్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఒక డీఏను వెంటనే చెల్లించాలని, రెండో డీఏను మరో ఆరు నెలల్లో చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. 2023 జనవరి 1వ తేదీ నుంచి బకాయి ఉన్న డీఏలలో ఒక డీఏను వెంటనే చెల్లిస్తుంది. అప్పటి నుంచి ఇప్పటివరకు బకాయి పడ్డ ఎరియర్స్ ను 28 వాయిదాల్లో చెల్లిస్తారు. మరో డీఏ ను వచ్చే ఏప్రిల్ లో ప్రకటించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

- ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల వివరాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కేబినెట్‌కు నివేదించారు. ఉద్యోగుల డిమాండ్లపై మే 6 వ తేదీన ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ తమ నివేదికను సమర్పించింది. ఉద్యోగులు ఇచ్చిన 57 డిమాండ్లను పరిశీలించిన మంత్రివర్గం అధికారుల కమిటీ నివేదిక ప్రకారం కొన్ని అంశాలను ఆమోదించగా.. కొన్నింటిని పరిశీలనకు స్వీకరించింది.
- ఉద్యోగులకు సంబంధించిన బకాయిలను ఇకపై ప్రతి నెలా క్రమపద్ధతిలో చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. బకాయిలకు ప్రతి నెలా రూ.700 కోట్లు చెల్లించాలని నిర్ణయం.
- ఉద్యోగుల హెల్త్ కార్డులకు సంబంధించి మంత్రి వర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల అభ్యర్థన మేరకు హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రతి సంవత్సరం సెప్టెంబర్లో డీపీసీ వేయనుంది.

2లో..

తొక్కిసలాట ఘటనపై

# కర్ణాటక హైకోర్టు సీరియస్

## - పూర్తి సమాచారం ఇవ్వాలని ఆదేశం






**బెంగుళూరు (ప్రశ్న న్యూస్)** 18 ఏళ్ల తర్వాత తొలిసారి ఐపీఎల్ కప్ సాధించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) విక్టరీ పరేడ్ సందర్భంగా బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించగా 33 మంది గాయాలపాలయ్యారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపగా సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కర్ణాటక హైకోర్టు గురువారం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ తొక్కిసలాట ఘటనపై సుమోటోగా ప్రజా ప్రయోజన వ్యాజ్యం నమోదు చేసింది. ఈ నేపథ్యంలోనే కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే నివేదిక ఇవ్వాలని కోరింది. కర్ణాటక హైకోర్టులు ఆపద్ధర్మ ప్రధాన న్యాయమూర్తి వి. కామేశ్వర్ రావు నేతృత్వంలోని డివిజన్ బెంచ్ తొక్కిసలాట ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. హైకోర్టులోని సీనియర్ కౌన్సిల్స్ హేమంత్ రాజ్, జి.ఆర్. మోహన్ చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన విషాద ఘటన గురించి సమాచారాన్ని చీఫ్

2లో..

రైతులపై వరుసగా కేసులు,

# ప్రశ్నిస్తున్న వారిపై దౌర్జన్యాలు

## - ప్రభుత్వాన్ని నిలదీసిన హరీష్ రావు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీద రైతుల కడుపుకొట్టి బడా పారిశ్రామిక వేత్తలకు భూములను కారుచౌకగా కట్టబెట్టడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిపోయిందని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. తనకు నచ్చిన బడాబాబుల కోసం 2013 భూసేకరణ చట్టాన్ని తుంగలో తొక్కుతూ భూములను బలవంతంగా సేకరించే భాధ్యతను సీఎం భుజాన వేసుకోవడంతో రైతులపై తరచుగా ప్రైవేటు వ్యక్తులు, పోలీసులు లాఠీలు ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడ గ్రామంలో ఇథనాల్ ఫ్యాక్టరీ బౌన్సర్లతో పాటు పోలీసులు కూడా రైతులపై విచక్షణారహితంగా దాడి చేయడం అమానుషమని మండిపడ్డారు. పాలమూరు బిడ్డను అని పదేపదే చెప్పుకునే రేవంత్ రెడ్డి తన జిల్లాలోనే ఘటన జరిగి 24 గంటలు అవుతున్నా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. పోలీసులు 12 గ్రామాల రైతులను కొట్టి, 40 మందిపై కేసులు పెట్టి, 12 మంది రిమాండ్ కి పంపించడం దుర్మార్గమన్నారు. రైతులను కొట్టించిన ఇథనాల్ ఫ్యాక్టరీ యజమానిపై కానీ, బౌన్సర్లపై కానీ ఎందుకు కేసులు పెటలేదో చెప్పాలని రేవంత్ సర్కారుని ప్రశ్నిస్తున్నానన్నారు.

### - ఫార్మా సిటీ భూములు తిరిగి ఇస్తామనిచెప్పి.. కేసులు

కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో ఇలాంటి ఘటనలు చాలా జరిగాయన్నారు. లగచర్లలో ఫార్మా కంపెనీని వ్యతిరేకించిన లంబాడా రైతులకు బేడీలు వేసిన ఘటనపై కేంద్ర మానవ హక్కుల

2లో..

వాళ్ల ఆవేదన

# పట్టించుకోండి

## - మంత్రి నారా లోకేశ్ కు షర్మిల విజ్ఞప్తి




**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ పరీక్షల నిర్వహణ విషయమై లక్షలాది మంది అభ్యర్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, వారి డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిగణనలోకి తీసుకోవాలని ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఉద్దేశించి ఆమె పలు కీలక సూచనలు చేస్తూ, అభ్యర్థుల పట్ల కనికరం చూపాలని కోరారు. డీఎస్సీ విషయంలో అభ్యర్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని షర్మిల పేర్కొన్నారు. "విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ గారూ, డీఎస్సీ పరీక్షలు నిర్వహించడం సరైన పద్ధతి కాదని లక్షలాది మంది అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. నోటిఫికేషన్ ఇచ్చినప్పటి నుంచి పరీక్ష సమయానికి

2లో..

# అమరావతిలో వనమహోత్సవం

## - మొక్కలు నాటిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్

## - గత సీఎం హెలికాప్టర్ లో వెళుతుంటే కింద ఉన్న చెట్లు ఎగిరిపోయేవి

## - గత ప్రభుత్వంలో పర్యావరణ పరిరక్షణ నిర్లక్ష్యానికి గురైందని ఆరోపణ



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన చేసారు.పర్యావరణ పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలవాలన్నారు. రాయలసీమ ప్రాంతంలో హార్టికల్చర్ బాగా అభివృద్ధి చెందుతోందని దీని పర్యావసానంగా ఇతర ప్రాంతాల్లో కూడా గ్రీన్ కవర్ పెరుగుతోందన్నారు. గత ముఖ్యమంత్రి హెలికాప్టర్ లో వెళ్తే కింద చెట్లు నరికేసే వారని ఎద్దేవా చేసారు. ఇదే సమయంలో ముఖ్యమంత్రి 175 నియోజకవర్గాలకు టార్గెట్ ఫిక్స్ చేస్తూ కొత్త ప్రాజెక్టు ప్రకటించారు. చెట్లు పెంచని వారికి గాలి పీల్చే హక్కు ఎక్కడిదని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. అమరావతి పరిధి అనంతవరం ఏడీసీఎల్ పార్కులో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ తో కలిసి సీఎం మొక్కలు నాటారు. ప్లాస్టిక్ రీసైక్లింగ్కి తీసుకుంటున్న చర్యలను కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ కృష్ణయ్య సీఎంకు వివరించారు. రాజధాని అమరావతిలో పచ్చదనం పెంచేందుకు

2లో..

# పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

## - వచ్చే ఏడాదిలోగా కోటి మొక్కలు నాటుతానని ప్రతిజ్ఞ



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నేడు అమరావతి ప్రాంతంలోని అనంతవరంలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఉద్వేగభరితంగా ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణకు తన వంతు కృషిగా వచ్చే ఏడాది ఇదే రోజు నాటికి రాష్ట్రంలో కనీసం కోటి మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నానని ఆయన ప్రకటించారు. అడవుల్లో కార్చిచ్చులను నివారించడం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడం వంటి కార్యక్రమాలను చేపడతామని తెలిపారు.

2లో..

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు తీవ్ర అస్వస్థత

## - ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తీవ్ర అస్వస్థకు గురయ్యారు. గత కొంతకాలంగా

2లో..

# మావోయిస్టులకు మరో దెబ్బ

## - కేంద్రకమిటీ సభ్యుడు సుధాకర్ మృతి



**ఛత్తీస్‌గఢ్ (ప్రశ్న న్యూస్)** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలో మావోయిస్టుల ఉనికి లేకుండా చేసేందుకు భారీ ఆపరేషన్లు చేపడుతోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఛత్తీస్‌గఢ్ సహా మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో భారీగా భద్రతా బలగాలను మోహరించి ఏరివేత ప్రక్రియను కొనసాగిస్తోంది. ఇటీవలె మావోయిస్ట్ అగ్రనాయకుడు నంబాల కేశవరావు భద్రతా బలగాల ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన నెలరోజుల్లోపే ఆ పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తెంటు లక్ష్మీ నరసింహాచలం అలియాస్ సుధాకర్ చనిపోయినట్లు సంబంధిత వర్గాలు చెప్పాయి. సింహాచలంకు చంటి బాలకృష్ణ రామరాజు, గౌతమ్, ఆనంద్, సోమన్న అనే పేర్లు కూడా ఉన్నాయి. సింహాచలం స్వస్థలం ఆంధ్రప్రదేశ్ ఏలూరు జిల్లాలోని చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామం. గత 4 దశాబ్దాలుగా

2లో..

పర్యావరణ పరిరక్షణ కోసం

# మొక్కలు నాటాలి

## - ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్బంగా మొక్కలు నాటిన మంత్రి పొన్నం ప్రభాకర్

## - మొక్కల పెంపకాన్ని నిర్లక్ష్యం చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరిక

## - భవిష్యత్ తరాలు ఆక్సిజన్ మాస్కులు ధరించాల్సి వస్తుందని ఆవేదన



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రస్తుత పరిస్థితుల్లో మొక్కలు నాటడంపై నిర్లక్ష్యం వహిస్తే, భవిష్యత్ తరాల వారు స్వచ్ఛమైన గాలి కోసం ఆక్సిజన్ మాస్కులు ధరించి తిరగాల్సిన దుస్థితి ఏర్పడుతుందని తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన హైదరాబాద్‌లోని గోల్కొండ ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యాన్ని అరికట్టడంలో విఫలమైతే మానవాళి అనేక రకాల నూతన వ్యాధుల బారిన పడుతుందని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు

2లో..

బెంగళూరు తొక్కిసలాట కేసులో

# ఐదుగురు పోలీసులపై సస్పెన్షన్ వేటు

## - కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలన్న సిద్ధరామయ్య



**బెంగళూరు (ప్రశ్న న్యూస్)** కర్ణాటక రాజధాని బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జూన్ 4న జరిగిన తొక్కిసలాట ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ దుర్ఘటనపై తీవ్రంగా స్పందించిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ బి. దయానంద, డీసీపీ (సెంట్రల్ డివిజన్) హెచ్.టి. శేఖర్‌తో సహా ఐదుగురు సీనియర్ పోలీసు అధికారులను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. విచారణను క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్

2లో..

# ఉద్యోగులకు 2 డీఏలు

- స్టేట్ లెవల్ మెడికల్ ఇన్‌వాలిడేషన్ కమిటీ ఏర్పాటు చేసేందుకు అంగీకరించింది. జాయింట్ స్టేట్ కౌన్సిల్, అసోసియేషన్లను రికగ్నిషన్ చేసేందుకు ఒప్పుకుంది.
- జీవో 317లో ఇంకా కొన్ని కేటగిరీలను చేర్చాలని నిర్ణయం
- కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన తెలంగాణ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన స్వర్గీయ మాజీ ప్రధాని శ్రీ మన్మోహన్ సింగ్ పేరు పెట్టాలని కేబినేట్ నిర్ణయం
- రాష్ట్రంలో సన్న ధాన్యం పండించే రైతులను ప్రోత్సహించాలని మంత్రివర్గం నిర్ణయం
- సన్నాలకు బోనస్‌తో రైతులకు లబ్ధి చేకూరిందని, సన్న వడ్లకు బోనస్ కొనసాగించాలని మంత్రివర్గం నిర్ణయం
- స్వయం సహాయక సంఘాలకు ప్రమాద బీమా పథకం అమలుకు రూ. 38.5 కోట్లు స్త్రీనిధికి కేటాయించాలని నిర్ణయం.
- ఇన్సూరెన్స్ కంపెనీలకు ప్రీమియం చెల్లించకుండా నేరుగా స్త్రీనిధి ద్వారా 385 మంది బాధిత కుటుంబాలకు ప్రమాదబీమా పరిహారం అందించాలని మంత్రివర్గం నిర్ణయం.
- పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి చర్యలు..
- రాష్ట్రంలోని అన్ని రోడ్లను అభివృద్ధి చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.
- హామ్ (హైబ్రిడ్ అన్యూయిటీ మోడల్) విధానంలో అన్ని నియోజకవర్గాల్లో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకునేందుకు కేబినేట్ ఆమోదం పంచాయతీరాజ్ పరిధిలో 7947 కిలోమీటర్లు, ఆర్ అండ్ బీ పరిధిలో 5190 కిలోమీటర్లు.. మొత్తం 13137 కిలోమీటర్ల రోడ్లను అభివృద్ధి చేస్తుంది.
- పంచాయతీ రాజ్ రోడ్లకు రూ. 16 వేల 780 కోట్లు, ఆర్ అండ్ బీ రోడ్లకు రూ. 16 వేల 414 కోట్లు ప్రభుత్వం రాబోయే రోజుల్లో ఖర్చు పెడుతుంది. హ్యామ్ విధానంలో రెండేండ్లలో నిర్మాణంతోపాటు 15 ఏండ్ల మెయింటెనెన్స్ కూడా ఏజెన్సీలదే బాధ్యత ఉంటుంది.
- పార్లమెంట్ ఒక యూనిట్ గా లేదా ఉమ్మడి జిల్లాల వారీగా ఒక్కో జిల్లా ఒక్కో ప్యాకేజ్‌గా విభజించి రోడ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయం.
- హైదరాబాద్ సిటీలో మెట్రో ఫేజ్ 2%దీ% ప్రాజెక్టుకు 86.1 కిలోమీటర్లకు రూ.19579 కోట్లతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ వెంచర్ తో చేపట్టాలని కేబినేట్ నిర్ణయించింది.
- కారిడార్-1లో శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 39.6 కి.మీ,
- కారిడార్-2 జూబ్లీ బస్ స్టేషన్ నుంచి మేడ్చల్ వరకు 24.5 కి.మీ
- కారిడార్-3 జూబ్లీ బస్ స్టేషన్ నుంచి శామీర్ పేట్ వరకు 22 కి.మీ

## తొక్కిసలాట ఘటనపై కర్ణాటక హైకోర్టు సీరియస్

జస్టిస్‌కు సమర్పించి భద్రతా లోపాలను హైలైట్ చేశారు. ఆర్సీబీ ఆటగాళ్లకు సిద్ధరామయ్య ప్రభుత్వం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమాన్ని చూడటానికి అధిక సంఖ్యలో వచ్చిన అభిమానులు విధానసౌధకు ఎదురుగా ఉన్న హైకోర్టు భవనాన్ని ఎలా ఎక్కారో కూడా వారు హైకోర్టుకు వెల్లడించారు.ఇక ఈ తొక్కిసలాటలో చనిపోయిన 11 మంది మరణాలకు సంబంధించి కర్ణాటక పోలీసులు అన్‌నేచురల్ డెత్ కేసులు (అసహజ మరణాల కేసులు) మాత్రమే నమోదు చేశారు. ఈ ఘటనపై బెంగళూరు కబ్బన్ పార్క్ పోలీసులు 11 కేసులు నమోదు చేసినప్పటికీ ఈ ఘటనకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే బెంగళూరు పోలీసుల చర్యలపై ప్రస్తుతం అంతటా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది, ఎందుకంటే కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ), ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీపై కేసు నమోదు చేసే అవకాశం ఉన్నప్పటికీ పోలీసులు ఆ పని చేయలేదని తెలుస్తోంది. ఇప్పటివరకు ఈ ఘటనకు ఎవరూ బాధ్యత వహించడానికి ముందుకు రాలేదని సంబంధిత వర్గాలు ధృవీకరించాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఈ అసహజ మరణాల కేసులు నమోదు చేసినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

### - కర్ణాటక ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిపై ఫిర్యాదులు

ఇక చిన్నస్వామి తొక్కిసలాట ఘటనపై సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ గురువారం కబ్బన్ పార్క్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందులో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కేఎస్‌సీఏ కార్యనిర్వాహకులు, ఇతరులపై ఫిర్యాదు చేశారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) చట్టంలోని సెక్షన్ 106 కింద వీరిపై కేసు నమోదు చేయాలని స్నేహమయి కృష్ణ డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదు కాపీని కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి బెంచ్‌కు కూడా పంపించారు. ఇది తీవ్రమైన సంఘటన కాబట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో హైకోర్టును అభ్యర్థించారు. అదే విధంగా ఈ పిటిషన్‌ను డీజీపీ, ఐజీ, బెంగళూరు నగర పోలీస్ కమీషనర్‌కు కూడా పంపారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర పైస్థాయి వ్యక్తుల పాత్ర ఇందులో ఉందని పిటిషనర్ ఆరోపించారు. మరోవైపు విక్టోరియా, బౌరింగ్ ఆస్పత్రులలో చనిపోయిన 11 మంది మృతదేహాలకు పోస్ట్‌మార్టం పూర్తి చేసిన అధికారులు వాటిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇక ఈ ఘటనలో చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు కర్ణాటక ప్రభుత్వం రూ. 10 లక్షల పరిహారం ప్రకటించడంతో పాటు తొక్కిసలాటపై మేజిస్టీరియల్ విచారణకు ఆదేశించింది. ఇక ఈ ఘటనపై తీవ్ర విమర్శలు గుప్పించిన కర్ణాటకలోని ప్రతిపక్ష బీజేపీ చిన్నస్వామి స్టేడియం సమీపంలో జరిగిన తొక్కిసలాటలో సంభవించిన మరణాలు ప్రభుత్వ ప్రాయోజిత హత్యలు అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని తీవ్రంగా పేర్కొంది. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ కర్ణాటక హెూంశాఖ మంత్రి జి. పరమేశ్వర తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది.

## రైతులపై వరుసగా కేసులు, ప్రశ్నిస్తున్న వారిపై దౌర్జన్యాలు

సంఘం, ఎస్సీ, ఎస్టీ కమిషన్ తప్పుపట్టినా బుద్ధి రాలేదని మండిపడ్డారు. నిర్మల్ జిల్లా దిలావర్పూర్ లో కూడా ఇథనాల్ ఫ్యాక్టరీని వ్యతిరేకించిన రైతులను కొట్టారని, మీ రియల్ ఎస్టేట్ దందాలు పెంచుకోవడానికి 6 లైన్ల గ్రీన్ ఫీల్డ్ రోడ్ విషయంలో కూడా రైతులపై కేసులు పెట్టారని మండిపడ్డారు. మేము అధికారంలోకి వస్తే ఫార్మా సిటీ భూములు తిరిగిస్తానని నమ్మబలికి అధికారంలోకి వచ్చి తిరిగి అదే రైతులపై కేసులు పెట్టావని మండిపడ్డారు.

### రైతులపై తక్షణం కేసులు ఎత్తివేయాలి

జహీరాబాద్ న్యాలకల్ రైతులపై విచక్షణారహితంగా దాడి చేసి అక్రమ కేసులు పెట్టించావని సూర్యాపేట జిల్లా చిలకలూరు గ్రామం రైతులు రుణమాఫీ కాలేదని ప్రశ్నిస్తే 42 మందిపై కేసులు పెట్టి పోలీస్ జులుం చూపించావని రేవంత్ రెడ్డిపై హరీష్ రావు మండిపడ్డారు. ధాన్యం కోతలను ప్రశ్నించినందుకు నిర్మల్ జిల్లా ఏర్వచింతలో రైతులపై కేసులు పెట్టారన్నారు. ఇంకా ఎన్ని రకాలుగా రైతులను గోసపెడుతావ్ రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. రైతులకు, ప్రజలకు పనికి వచ్చే ఒక్క పని చేయడం లేదు కానీ, పెద్దలకు మాత్రం భూములను కట్టబెడుతావని రైతులను కొట్టు కమిషన్లు పట్టు అనే విధంగా సాగుతుంది నీ పాలన అని మండిపడ్డారు. తెలంగాణ రైతు లోకం తిరగబడే రోజు ఎంతో దూరంలో లేదని హెచ్చరించారు. అరెస్ట్ చేసిన పెద్ద ధన్వాడ గ్రామానికి చెందిన 12 మంది రైతులను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.

# వాళ్ల ఆవేదన పట్టించుకోండి

కేవలం 45 రోజులు మాత్రమే గడువు ఇవ్వడం ఎంతవరకు సమంజసం?" అని ఆమె ప్రశ్నించారు. ఇది మెగా డీఎస్సీ కాదని, అభ్యర్థులను మోసం చేసే 'దగా డీఎస్సీ' అని వారు వాపోతున్నారని షర్మిల తెలిపారు. కనీసం 90 రోజుల ప్రిపరేషన్ సమయం ఉండాలని అభ్యర్థులు కోరుతున్నారని, కేవలం 45 రోజుల్లో మొత్తం సిలబస్ చదవడం సాధ్యం కాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆమె వివరించారు.

"మూడున్నర లక్షల మంది డీఎస్సీ అభ్యర్థుల పట్ల ప్రభుత్వం కనికరం చూపాలి. వారు మీకు లేఖల మీద లేఖలు రాస్తున్నా స్పందించకపోవడం, నిరుద్యోగుల మొరను పట్టించుకోకపోవడం కూటమి ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు నిదర్శనం" అని షర్మిల విమర్శించారు. డీఎస్సీ వాయిదా వేయాలని కోరడాన్ని రాజకీయ కుట్రగా మంత్రి లోకేశ్ అభివర్ణించడం ఆయన తొందరపాటు నిర్ణయానికి అద్దం పడుతోందని ఆమె అన్నారు. కాంగ్రెస్ పార్టీ పక్షాన కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని చెబుతూ, డీఎస్సీ నిర్వహణలో పరీక్ష రాసే అభ్యర్థుల డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలని షర్మిల కోరారు. "90 పాఠ్య పుస్తకాలను కేవలం 45 రోజుల్లో అభ్యర్థులు ఎలా చదవగలరో ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. ప్రిపరేషన్ గడువును మరో 45 రోజులు పెంచే అంశంపై తక్షణమే పరిశీలన చేయాలి" అని ఆమె డిమాండ్ చేశారు. అంతేకాకుండా, నార్మలైజేషన్ పద్ధతిలో కాకుండా డీఎస్సీ పరీక్షలను ఒకే జిల్లా, ఒకే పేపర్ విధానంలో నిర్వహిస్తే బాగుంటుందన్న అభ్యర్థుల వాదనపై కూడా ప్రభుత్వం పునరాలోచన చేయాలని షర్మిల కోరారు.

## పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలి

ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని, మొక్కలు నాటడాన్ని కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా సామాజిక బాధ్యతగా స్వీకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

మొక్కలు నాటడమే కాకుండా, వాటిని సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి సూచించారు. పచ్చదనం పెంపొందించడం ద్వారానే పర్యావరణ సమతుల్యతను కాపాడుకోగలమని, తద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని భవిష్యత్ తరాలకు అందించగలమని ఆయన తెలిపారు. పర్యావరణ హిత చర్యలకు ప్రతి పౌరుడు తమ వంతు సహకారం అందించాలని కోరారు.

# అమరావతిలో వనమహోత్సవం

ప్రధాని నరేంద్ర మోదీ సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మియావకీ గార్డెన్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. మలేషియా, సింగపూర్, సౌత్ కొరియా, జపాన్, అమెరికాలో మియావకీ విధానాలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటుతున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్ష ణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమం త్రి వస్తుంటే ఎక్కడైనా ఒక్క చెట్టు తాము నరుకుతున్నామా అని ప్రశ్నించారు. కొన్ని దేశాల్లో చెట్లు నరికితే శాశ్వతంగా జైల్లో పెడతారన్నారు. చెట్లు నరికితే మనిషిని చంపినట్టే అని కొన్ని దేశాల్లో చట్టాలు కూడా ఉన్నాయన్నారు. నాలుగు సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 37 శాతం గ్రీన్ కవర్ రావాల్సి ఉందన్నారు. రాఖీలు కట్టే చెల్లెమ్మలకు ఇకపై అన్న నక్షత్రం పేరుకు తగ్గ ట్టుగా విత్తనాలు ఇస్తామన్నారు. వచ్చే ఏడాది నాటికి పూర్తిగా ప్లాస్టిక్‌ను నిషేధిస్తామన్నారు. 175 నియోజక వర్గాల్లో నగర వనాలు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు.

### - అందరం ఆక్సిజన్ తీసుకుంటున్నాం కదా.. మరి మొక్కలు నాటే బాధ్యత లేదా?

రానున్న నాలుగైదు సంవత్సరాల్లో రాష్ట్రంలో కనీసం 37 శాతం పచ్చదనం ఉండేలా చూడాలన్నది తమ లక్ష్యమని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇందుకోసం ఉద్యానవన పంటల (హార్టికల్చర్) అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని, ఈ విషయంలో పవన్ కల్యాణ్ కూడా స్పష్టమైన సూచనలు చేశారని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో కనీసం పది మొక్కలు నాటి పెంచాలని పిలుపునిచ్చారు. "అందరం ఆక్సిజన్ తీసుకుంటున్నాం కదా? మరి మొక్కలు నాటే బాధ్యత మనపై లేదా?" అని ప్రజలను ప్రశ్నించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన రావాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. ప్రపంచం ఎదుర్కొంటున్న పెను సవాళ్లలో గ్లోబల్ వార్మింగ్ ఒకటని, దీనివల్ల ఉష్ణోగ్రతలు పెరిగి వర్షాలు తగ్గిపోతున్నాయని, భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. దీని ప్రభావంతో సాగు ప్రమాదంలో పడుతోందని, తాగునీటికి ఇబ్బందులు తలెత్తి ఫ్లోరైడ్ సమస్యలు పెరిగి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన చెందారు. చిన్నప్పుడు చదువుకున్న కథను గుర్తుచేస్తూ, "ఒక వృద్ధుడు తన తర్వాతి తరాల కోసం చెట్టు నాటినట్లు, మనం కూడా భవిష్యత్ తరాల కోసం చెట్లు నాటాలి. స్వార్థంతో బతకడం కాదు, విజ్ఞతతో ప్రవర్తించాలి," అని హితవు పలికారు. పద్మశ్రీ వనజీవి రామయ్య వంటి వ్యక్తులు మనకు ఆదర్శమని, వారి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు.

# మావోయిస్టులకు మరో దెబ్బ

మావోయిస్ట్ ఉద్యమంలో చురుకుగా ఉన్న సింహాచలంపై పోలీసులు రూ. కోటి రివార్డు ప్రకటించారు. 2004లో ఏపీ ప్రభుత్వంతో జరిగిన శాంతి చర్చల్లో ఆయన పాల్గొన్నాడు. బీజాపూర్ అడవుల్లో ఇంద్రావతి టైగర్ రిజర్వ్‌లో మావోయిస్ట్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు ఉన్నారని తాజాగా భద్రతా బలగాలకు పక్కా సమాచారం అందింది. దీంతో డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్ దళాలు అక్కడి చేరుకుని ఆ ప్రాంతం మొత్తాన్ని దిగ్బంధించారు. అనంతం తనిఖీలు చేపట్టగా గురువారం తెల్లవారుజామున భద్రతా బలగాలు-మావోయిస్టుల మధ్య భీకర ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఆపరేషన్‌లోనే సింహాచలం మృతి చెందినట్లు తెలుస్తోంది.ఇక ఈ ఎన్‌కౌంటర్‌ను బీజాపూర్ ఎస్పీ డాక్టర్ జితేంద్ర యాదవ్ ధ్రువీకరించారు. అయితే ఆయన సింహాచలం మృతి గురించి ఎలాంటి ప్రకటన వెలువరించకపోవడం గమనార్హం. అయితే బీజాపూర్ అడవుల్లో ఇంకా భద్రతా బలగాల సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని వివరించారు. దీంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో భారీగా ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. గత 6 నెలల వ్యవధిలో మావోయిస్ట్ కేంద్ర కమిటీకి చెందిన ముగ్గురు అగ్రనాయకులు ఎన్‌కౌంటర్లలో హతం కావడం వారికి కోలుకోలేని దెబ్బగా మారింది.మరోవైపు.. సింహాచలం చనిపోయిన ప్రాంతంలోనే మరికొందరు కేంద్ర కమిటీ సభ్యులు ఉన్నట్లు భద్రతా బలగాలకు సమాచారం వచ్చింది. తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మావోయిస్ట్ పార్టీ మాజీ ప్రెస్ ఇంఛార్జ్ బండి ప్రకాష్, మావోయిస్ట్ స్పెషల్ జోన్ కమిటీ సీనియర్ లీడర్ పాపారావు కూడా అదే ప్రాంతంలో ఉన్నారని తమకు సమాచారం వచ్చినట్లు బస్తర్ ఐజీ పి.సుందర్ రాజు తెలిపారు. మావోయిస్టుల నియమించుకోవడం, వారి తరపున ప్రచారం చేయడం, దక్షిణ బస్తర్‌లో మావోయిస్ట్ కార్యకలాపాలను పర్యవేక్షించే బాధ్యతలను బండి ప్రకాష్ నిర్వహిస్తున్నారని వెల్లడించారు. బండి ప్రకాష్‌పై రూ.25 లక్షల రివార్డ్ ఉంది. మరోవైపు పాపారావు గెరిల్లా యుద్ధ వ్యూహాలు రచించడంలో నిపుణుడిగా చెబుతారు. భద్రతా బలగాలను బోల్తా కొట్టించే ఉచ్చులు పన్నడంలో అతడు దిట్ట అని పేరుంది. ఐఈడీ సహా ఇతర చాలా దాడుల్లో పాపారావు మోస్ట్‌వాంటెడ్ మావోయిస్ట్‌గా ఉన్నాడు. అతడిపై పోలీసులు రూ.20 లక్షల రివార్డు ప్రకటించారు. అయితే బండి ప్రకాష్, పాపారావు ఆచూకీకి సంబంధించిన సమాచారం ఇంకా వెల్లడి కాలేదని పోలీసులు వెల్లడించారు. కేవలం 3 వారాల వ్యవధిలో మావోయిస్టులకు మరో భారీ దెబ్బ తగలడంతో కోలుకోలేని పరిస్థితి నెలకొంది.

## బెంగళూరు తొక్కిసలాట కేసులో ఐదుగురు పోలీసులపై సస్పెన్షన్ వేటు

(సీఐడీ)కి అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. విధానసౌధలో గురువారం నిర్వహించిన అత్యవసర మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ కీలక నిర్ణయాలను వెల్లడించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపేందుకు హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ జాన్ మైఖేల్ డి'కున్హా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. "కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ (గిరీష్ ఎ.కె.), ఆ జోన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) (బాలకృష్ణ), సెంట్రల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) (హెచ్.టి. శేఖర్), స్టేడియం భద్రతకు బాధ్యత వహించిన అదనపు పోలీస్ కమిషనర్, బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ (బి. దయానంద)లను తక్షణమే సస్పెండ్ చేయాలని నిర్ణయించాం" అని సిద్ధరామయ్య పేర్కొన్నారు. ఈ విషాద ఘటనకు సంబంధించి ఉప ముఖ్యమంత్రి, హెూంమంత్రి, మంత్రులు హెచ్.కె. పాటిల్, ఎం.సి. సుధాకర్, హెచ్.సి. మహదేవప్పలతో పాటు సీఐడీ అధికారులతో చర్చించిన అనంతరం ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు సీఎం వివరించారు. "ప్రాథమికంగా ఈ అధికారుల బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించాయి. అందుకే వారిని సస్పెండ్ చేయాలని నిర్ణయించాం" అని ఆయన స్పష్టం చేశారు. ఆర్సీబీ జట్టు తొలిసారిగా ఐపీఎల్ ట్రోఫీ గెలిచిన సందర్భంగా జరిగిన సంబరాల్లో ఈ తొక్కిసలాట జరగడం బాధాకరమని, మృతి చెందిన వారికి సంతాపం తెలియజేస్తున్నామని సీఎం అన్నారు. ఈ అంశాన్ని గురువారం జరిగిన సాధారణ కేబినెట్ సమావేశంలో తీవ్రంగా చర్చించామని, నిన్నటి దురదృష్టకర ఘటనపై చర్చించిన తర్వాతే ఈ నిర్ణయాలు తీసుకున్నామని సిద్ధరామయ్య తెలిపారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఫ్రాంచైజీ, డీఎన్ఏ ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ, కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) ప్రతినిధులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, వారిని అరెస్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు సీఎం చెప్పారు. వారిపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. "నేను ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి ఇలాంటి ఘటన జరగలేదు. ఈ ఘటన మమ్మల్ని తీవ్రంగా కలచివేసింది" అని సిద్ధరామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. "నిన్న ఆదేశించినట్లుగా మేజిస్టీరియల్ విచారణ ప్రారంభమైంది. ఈ పెను విషాదంపై కొంత సమాచారం అందిన తర్వాత, కేబినెట్ సమావేశంలో చర్చించాం. మూడు సంస్థలపై (ఆర్సీబీ, డీఎన్ఏ ఈవెంట్స్, కేఎస్‌సీఏ) దర్యాప్తును సీఐడీకి అప్పగించాం" అని ఆయన పునరుద్ఘాటించారు.

## 19 దేశాలకు షాకిచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన మొదటి పదవీకాలాన్ని గుర్తుకు తెస్తూ మరోసారి కీలక నిర్ణయం తీసుకున్నారు. జాతీయ భద్రతను ప్రధాన కారణంగా చూపుతూ, 19 దేశాల పౌరులు అమెరికాలోకి ప్రవేశించడంపై కొత్తగా కఠినమైన ప్రయాణ ఆంక్షలు విధిస్తూ బుధవారం ఉత్తర్వులపై ఆయన సంతకం చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, 12 దేశాల పౌరులు అమెరికాలో ప్రవేశించడంపై పూర్తి నిషేధం అమల్లోకి రానుండగా, మరో 7 దేశాల వారికి పాక్షిక పరిమితు లు వర్తిస్తాయి. పూర్తిస్థాయి ప్రయాణ ఆంక్షలు ఎదుర్కొంటున్న దేశాల జాబితాలో ఆఫ్ఘనిస్థాన్, బర్మా, చాద్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఈక్వటోరియల్ గినియా, ఎరిట్రియా, హైతీ, ఇరాన్, లిబి యా, సోమాలియా, సుడాన్, యెమెన్ ఉన్నాయి. అలాగే బురుండి, క్యూబా, లావోస్, సియెర్రా లియోన్, టోగో, తుర్క్‌మెనిస్థాన్, వెనిజులా దేశాల పౌరులు అమెరికాలోకి ప్రవేశించే విష యంలో పాక్షిక పరిమితులను ఎదుర్కోనున్నారు. 2025 జనవరి 20న ట్రంప్ తిరిగి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వు 14161 ప్రకారం ఈ చర్య తీసుకున్నట్లు శ్వేతసౌధం వెల్లడించింది. తీవ్రవాదం, జాతీయ భద్రతతో సహా వివిధ దేశాల వల్ల అమెరికాకు పొంచి ఉన్న ముప్పుపై సమగ్రమైన అంచనా వేసిన అనంతరమే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. సందర్శకులు, వీసా దరఖాస్తుదారుల నేపథ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలిం చడం అసాధ్యంగా ఉన్న దేశాలను గుర్తించాలని, అలాంటి దేశాలు జాతీయ భద్రతకు ముప్పు కలిగించే అవకాశం ఉందని ఆ కార్యనిర్వాహక ఉత్తర్వు సంబంధిత ఏజెన్సీలను ఆదేశించింది.

# పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

ఈ సందర్భంగా పర్యావరణవేత్త కుమెర అంకారావు సేవలను పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. "14 ఏళ్ల వయసులో ప్లాస్టిక్ వ్యర్థాలు తిని ఒక పక్షి చనిపోవడం చూసి చలించిపోయి, మూడు దశాబ్దాలుగా పర్యావరణ పరిరక్షణకు అంకితమైన కుమెర అంకారావు గారి నిబద్ధత ప్రశంసనీయం. ఆయనకున్నంత అర్హత బహుశా నాకు లేదేమో అనిపిస్తుంది" అంటూ పవన్ వినమ్రంగా వ్యాఖ్యానించారు. నల్లమల అడవుల పరిరక్షణ కోసం అంకారావు చేస్తున్న కృషి తనకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. అటువంటి వ్యక్తిని ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి, అధికారులకు పవన్ ధన్యవాదాలు తెలియజేశారు. పర్యావరణ పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు స్ఫూర్తి అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. "చెట్టు-నీరు" వంటి కార్యక్రమాల ద్వారా చంద్రబాబు పర్యావరణ పరిరక్షణకు ఎంతో కృషి చేశారని, ఆయన మార్గదర్శకత్వంలో పర్యావరణ మంత్రిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని చెప్పారు. "ప్రస్తుతం అటవీ, పర్యావరణ శాఖల బాధ్యతలు నా వద్ద ఉన్నాయి. వచ్చే ఏడాది ఇదే సమయానికి కోటి మొక్కలు నాటడమే కాకుండా, అడవుల్లో కార్చిచ్చులను అరికట్టి, గొర్రెలు, మేకల కాపరులకు అవగాహన కల్పించి, అడవుల నరికివేతను తగ్గించి, అప్పుడు మరింత అనుభవంతో మీ ముందుకొచ్చి మాట్లాడతాను" అని పవన్ కల్యాణ్ అన్నారు. చెట్లు మన జీవితంలో ఎంత కీలకమో వివరిస్తూ, "ఒకప్పుడు ఇళ్లకు దారి చెప్పాలంటే మర్రిచెట్టునో, గోరింటాకు చెట్టునో ఆనవాలుగా చెప్పేవాళ్ళం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. చెట్లు లేని జీవితాన్ని ఊహించుకోలేం. అవి కేవలం పక్షులకే కాదు, ప్రతి ఒక్కరికీ ఆధారం" అని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 50 శాతం పచ్చదనం సాధించాలన్న ముఖ్యమంత్రి లక్ష్యాన్ని చేరుకోవడానికి తన వంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. "ముఖ్యమంత్రి గారు మా అందరికీ రాష్ట్రంలో 33 శాతం కాకుండా, 50 శాతం అటవీ విస్తీర్ణం ఉండాలని లక్ష్యం నిర్దేశించారు. ఆంధ్రప్రదేశ్‌ను పర్యావరణ పరిరక్షణలో, అటవీ సంరక్షణలో, నగర వనాల్లో తలమానికంగా నిలపడానికి మనమందరం కృషి చేద్దాం" అని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి ఇచ్చే సూచనలు, సలహాలు స్వీకరించి, వచ్చే ఏడాదికి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకుని ఆయన మెప్పు పొందేలా పనిచేస్తామని పవన్ కల్యాణ్ తన ప్రసంగాన్ని ముగించారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు తీవ్ర అస్వస్థత

ఆయనను మూత్రపిండాల వ్యాధి (కిడ్నీ డిసీజ్) తీవ్రంగా వేధిస్తోంది. ఈ అనారోగ్యంతో ఆయన గచ్చిబౌలిలోని ప్రముఖ ఏఐజీ ఆస్పత్రిలో నిపుణులైన వైద్య బృందం పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితి నిలకడగా లేదనే వార్తలు వెలువడటంతో నియోజకవర్గ ప్రజల్లో, బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మాగంటి గోపీనాథ్ తన అనారోగ్యంతో సుదీర్ఘకాలంగా పోరాడుతున్నారు. గత నాలుగు నెలలుగా ఆయన నివాసంలో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. కొన్ని నెలల క్రితం నిర్వహించిన వైద్య పరీక్షలలో ఆయనకు మూత్రపిండాలు పూర్తిగా పనిచేయడం లేదని (కిడ్నీ ఫెయిల్యూర్) నిర్ధారణ అయింది. అప్పటినుంచి ఆయన నిరంతరం వైద్య చికిత్సలు తీసుకుంటూనే ఉన్నారు. అయితే గత నాలుగు రోజులుగా ఆయన ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించడంతో, కుటుంబ సభ్యులు ఆయన్ని అత్యవసరంగా గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య నిపుణులు ఆయనకు అత్యున్నత స్థాయి వైద్య సహాయం అందిస్తున్నారు. కీలకమైన అవయవాలు ఎలా స్పందిస్తున్నాయో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఆయన కుటుంబ సభ్యులు, ఆసుపత్రి వర్గాలు ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయనప్పటికీ, అంతర్గత సమాచారం ప్రకారం ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది.

### ప్రజా నాయకుడి కోసం ప్రార్థనలు..

మాగంటి గోపీనాథ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఒక బలమైన ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారు. బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కూడా ఆయన కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన ఆరోగ్యం పట్ల ఆందోళన చెందుతున్న అభిమానులు, కార్యకర్తలు ఆయన త్వరగా కోలుకోవాలని, మళ్లీ ప్రజాసేవలో కొనసాగాలని ప్రార్థిస్తున్నారు. రాజకీయ ప్రముఖులు కూడా ఆయన ఆరోగ్య పరిస్థితిని నిరంతరం అడిగి తెలుసుకుంటూ, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. ఈ క్లిష్ట సమయంలో ఆయన కుటుంబానికి అండగా నిలుస్తున్నారు.

## భారత్‌తో శాంతిచర్చలకు యూఎస్ మధ్యవర్తిత్వం కావాలి



పెహల్గామ్ దాడి తర్వాత పాకిస్తాన్ ఉగ్రవాద దాడికి వ్యతిరేకంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఈ ఆపరేషన్ ద్వారా భారత ఆర్మీ పాకిస్తాన్ ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. ఆ తర్వాత ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత ప్రభుత్వం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసి ప్రపంచ దేశాలకు తన గళాన్ని వినిపిస్తోంది. ఇప్పటికే పలు దేశాలు ఈ బృందాలు వెళ్లి ఉగ్రవాదంపై భారత వైఖరిని స్పష్టం చేశాయి. ఈ సందర్భంగా పలు దేశాలు భారత్‌కి మద్దతుగా నిలుస్తున్నాయి. ఈ తరుణంలో ఉగ్రవాదానికి కేంద్ర బిందువైన పాకిస్తాన్‌కి ఆందోళన మొదలైంది. ప్రపంచ దేశాలు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలవడంతో.. పాకిస్తాన్ ప్రధాని భారత్‌తో సంప్రదింపులు జరిపేందుకు సిద్ధమయ్యారు. శాంతి చర్చల కోసం భారత్‌తో సంప్రదింపులు జరిపేందుకు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అమెరికా సహాయాన్ని కోరుతున్నారు. ప్రస్తుతం పొరుగున్న భారత్‌తో తలెత్తిన ప్రస్తుత పరిస్థితులను చక్కదిద్దేందుకు ట్రంప్ సహాయాన్ని కోరినట్లు, ఇరు దేశాల మధ్య సంప్రదింపులను సులభతరం చేయాలని అమెరికాను కోరినట్లు ఇస్లామాబాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో షెహబాజ్ అన్నారని మీడియా పేర్కొంది.

## బ్రెజిల్ వేదికగా బ్రిక్స్ సమావేశం..

వచ్చే నెలలో బ్రెజిల్‌లో జరిగే బ్రిక్స్ సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హాజరుకానున్నారు. ఈ సమావేశానికి రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షులు జిన్‌పింగ్‌లతో పాటు సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇరాన్, ఈజిప్టు, ఇండోనేషియా నాయకులు హాజరవుతారని భావిస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాల కూటమి జి-7కు ప్రత్యామ్నాయంగా బ్రిక్స్‌ను అమెరికా భావిస్తోంది. ఆపరేషన్ సిందూర్ తరువాత జరుగుతున్న ఈ కార్యక్రమానికి మోడీ హాజరుకావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ బ్రిక్స్ సమావేశంలో సీమాంతర ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఉమ్మడి ప్రకటన భారత్‌కు కీలకమైనదిగా అధికారులు భావిస్తున్నారు. బ్రిక్స్ సమావేశంలో వాణిజ్యం, ప్రత్యామ్నాయ కరెన్సీ వినియోగంపై జరిగే చర్చలపై కూడా అందరి దృష్టి ఉంది. బ్రిక్స్ 'డి-డాలరైజేషన్' ప్రణాళికలకు వ్యతిరేకంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేస్తున్నారు. బ్రిక్స్ సమావేశం నోట్ ప్రకారం అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్), ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటిఓ) వంటి సంస్థల్లో సంస్కరణలు, 'నాయకత్వ స్థానాల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాతినిధ్యాన్ని పెంచడం', ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు గ్లోబల్ సౌత్ సహకారం.. వంటి అంశాలపైనా ఈ శిఖరాగ్ర సమావేశం చర్చిస్తుంది.

# ఊపు ఎక్కడా....

**విజయవాడ:** ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలు జరిగి ఫలితాలు వచ్చి ఏడాది గడుస్తుంది. అయితే ఈ ఏడాదిలో వైసీపీ పరిస్థితి ఏంటన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గత ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా వైసీపీకి లభించలేదు. 175 నియోజకవర్గాలకు గాను కేవలం పదకొండు స్థానాలు మాత్రమే వైసీపీకి వచ్చాయి. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటయిన శాసనసభ సమావేశాలకు కూడా వైసీపీ ఎమ్మెల్యేలు హాజరు కావడం లేదు. దీంతో ప్రజాసమస్యలను శాసనసభలో ప్రస్తావించేవారు లేదు. తనకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే వస్తానని జగన్ పట్టుబట్టడం కూడా ప్రజల్లో ఒకరకమైన వ్యతిరేక భావన ఏర్పడింది. ప్రతిపక్ష హోదా ఇస్తేనే వెళతామని అనడం సరికాదన్న కామెంట్స్ బాగానే వినిపిస్తున్నాయి,శాసనసభలో వైసీపీ వాయిస్ లేకుండా పోయింది. ఇది జగన్ పార్టీకి మైనస్ అని చెప్పాలి. అదేసమయంలో జగన్ ఏడాది నుంచి బెంగళూరు నుంచి విజయవాడ కు ట్రిప్పులు వేస్తున్నారు. నెలలో కొన్ని రోజులు మాత్రమే నేతలకు అందుబాటులో ఉంటున్నారు. స్థానిక సంస్థలను కూటమి ప్రభుత్వం కైవసం చేసుకోవడంతో ఆయన తరచూ లోకల్ లీడర్లతో భేటీ అవుతున్నారు. మళ్లీ వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనన్న నమ్మకాన్ని కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. అయినా స్థానిక సంస్థలన్నీ కూటమి పరమయిపోయాయి. ఇక ఉగాది నుంచి జిల్లాల పర్యటనలు చేస్తానని ప్రకటించిన వైఎస్ జగన్ ఎప్పటికప్పుడు తన పర్యటనను వాయిదావేసుకుంటూ వెళుతున్నారు. ఏడాది కూటమి ప్రభుత్వంలో తమ వారిపై నమోదవుతున్న కేసుల విషయంలోనే జగన్ కొంత పట్టించుకుంటున్నారు. ఏడాది నుంచి నియోజకవర్గాల ఇన్ ఛార్జులతో సమావేశం కాలేదు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. చివరకు తన సొంత జిల్లా కడపలోనూ నేతలతో ఆయన సమావేశమవ్వడం తక్కువేనని అంటున్నారు. ఈసారి అధికారంలోకి వస్తే కార్యకర్తలకు ప్రాధాన్యత నిస్తామని చెబుతున్న జగన్ మాత్రం నేతలకు సంబంధించి ఎటువంటి భరోసా ఇవ్వడం లేదు. గత ఎన్నికల్లో ఇష్టారీతిన నియోజకవర్గాలను మార్చేశారు. నేతలకు పట్టున్న నియోజకవర్గాల నుంచి బయటకు పంపారు. ఈ ప్రయోగం విఫలమయిందని తెలిసినా తిరిగి అక్కడ ఇన్ ఛార్జులను నియమించకపోవడంతో ఏడాదిగా ఆ యా ప్రాంతాల్లో క్యాడర్ అయోమయంగా ఉంది.మరొక వైపు అప్పుడప్పుడు ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు చేస్తున్నప్పటికీ, మీడియా సమావేశాలు పెడుతున్నప్పటికీ జగన్ ఇంకా పూర్తి స్థాయిలో జనానికి అందుబాటులోకి రాలేదు.

తాడేపల్లి కేంద్ర కార్యాలయానికే అధికారంలో లేనప్పుడు కూడా పరిమితమయ్యారు. రైతుల సమస్యలపై కొంత వెళుతున్నప్పటికీ జగన్ 2019 ఎన్నికలకు ముందు చేసిన తరహాలో దీక్షలు, ధర్నాలు వంటివి చేయకపోవడం పార్టీ క్యాడర్ లో ఇంకా ఊపు తెప్పించలేకపోతుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. కూటమి ప్రభుత్వాన్ని ఎండగట్టే ప్రయత్నం చేస్తున్నప్పటికీ అది జనంలోకి బలంగా వెళ్లగలిగేలా మాత్రం ఆయన చర్యలు ఫలితాలు ఇవ్వడం లేదన్నది మాత్రం యదార్థం.ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను సొమ్ము చేసుకోవడంలో కనీసం యాభై శాతం కూడా సక్సెస్ కాలేకపోయినట్లు రాజకీయ విశ్లేషకుల అంచనా.

# జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం కిట్లను పంపిణీ

### - పంపిణి కార్యక్రమం లో జనసేన మండల నాయకులు

**కౌతాళం** జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జనసేన పార్టీ కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ చింత సురేష్ బాబు సూచనల మేరకు జనసేన మండల నాయకులు రామాంజనేయులు ఆధ్వర్యంలో కౌతాళం మండలం చూడి గ్రామంలో 500 రూపాయలతో క్రియాశీలక సభ్యత్వం చేసుకున్న వారికి వాలంటీర్లకు మరియు కార్యకర్తలకు కిట్లను అందజేయడం జరిగింది కావున వారు మాట్లాడుతూ దేశంలోనే ఏ పార్టీ చేయలేని విధంగా జనసేన సభ్యత్వం తీసుకున్న వాళ్లకు ప్రమాద శాతం ఏదైనా జరిగిన వాళ్లకు ఐదు లక్షల ఐదు లక్షల చొప్పున పరిహారం అందుతుంది అని అన్నారు దేశంలోని ఏ పార్టీ చేయలేని విధంగా జనసేన పార్టీ చేయబోతుంది కావున ఈ యొక్క క్రియసీలక సభ్యత్వం ఎంతో ప్రతిష్టాకమైనది అని వారు అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో జనసేన పార్టీనాయకులు రాంబాబు సాయిబన్న. ఆకాష్,మరియు చూడి గ్రామనీ జనసైనికులు భీమేష్ కోటేశ్వర, శరణప్ప గౌడ్ ,మంగళ వీరప్ప, బసవరాజు, తిమ్మప్ప,మంగలి వీరప్ప, గంగాధర్ మరియు కార్యకర్తలు గ్రామ ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## 33 శాతం రేషన్ సరుకుల పంపిణీ పూర్తి

**అనకాపల్లి** అనకాపల్లిలో ఇప్పటి వరకు 33 శాతం రేషన్ సరుకుల పంపిణీ పూర్తయినట్టు కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు.ఉదయం ఆమె కోట్ని వీధిలోని 15వ నంబర్ రేషన్ దుకాణాన్ని పరిశీలించారు. సరుకులు తూగు తప్పకుండా ఇవ్వాలని డీలర్లకు ఆదేశాలు ఇచ్చారు. ఫిర్యాదులు వచ్చినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఆరు లక్షల మొక్కలు నాటే కార్యక్రమం

### - పాల్గొన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం** శ్రీకాకుళంజిల్లాలో 6లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు.పాత్రునివలస గ్రామం నుండి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్,జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.ప్రభుత్వం ఉన్నత ఆశయంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టిందని,పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చెయాలని కోరారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎద్దుల కొండ ప్రాంతంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి జిల్లా కలెక్టర్ చేతన్ జిల్లా డివిజన్ అధికారులు ప్రజలు సత్యసాయి బాబా సేవాదళ్ సభ్యులు పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ ప్రాధాన్యత గురించి భావితరాలకు చెట్లు ఆవశ్యకత గురించి వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చేతన్ అందరి చేత పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు పర్యావరణాన్ని కాపాడుకుందాం అని ఇది ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత అని ప్రతి నీటి బొట్టును ఆధా చేసుకుందామని ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధిద్దామని ప్రతిజ్ఞ చేయించారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా పుట్టపర్తి లోని ఎద్దుల కొండలో మొక్కలు నాటామని పర్యావరణాన్ని రక్షించే ఈ బృహత్తర కార్యక్రమంలో నేను పాల్గొనడం చాలా ఆనందాన్ని ఇస్తుందని. చెట్లు మానవ జీవన మనుగడకు ఎంతో ఉపయోగపడతాయని. ప్రతి ఒక్కరూ విధిగా చెట్లను నాటి మరొకరికి ఆదర్శంగా నిలచి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందని పచ్చని చెట్లు ప్రగతికి సోపానం అని నేటి కాలంలో పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వంటి వస్తువులను పూర్తిగా నిషేధించాలని. అంతేకాకుండా వర్షాలు సమృద్ధిగా కురవాలి అన్న కాలుష్యాన్ని నివారించి ఆరోగ్యపరమైన ఆక్సిజన్ మానవ జీవన మనుగడకు అందించాలన్న చెట్లు ఎంతో అవసరం అని అటువంటి చెట్లను నరకకుండా అటవీ సంపదను కాపాడుకొని భావితరాలకు మనం బాసటగా నిలుస్తూ. చెట్ల యొక్క ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రతి నీటి చుక్క కూడా వృధా చేయకుండా కాపాడుకుందామని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, తో పాటు శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ చేతన్, ఆర్డీవో సువర్ణ, డీఎస్పీ విజయ్ కుమార్, సత్య సాయి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, జిల్లా అధికార యంత్రాంగం, అటవీ శాఖ అధికారులు,ఒకసారి సేవాదళ్ సభ్యులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని చెట్లను నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మావోయిస్టుకు బిగ్ షాక్

**హైదరాబాద్ :** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ నేషనల్ పార్క్‌లో ఆఖీఉ,, ాుఈ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో సెంట్రల్ కమిటీ సభ్యుడు,, 40 లక్షల రూపాయల రివార్డు కలిగిన నక్సల్ సుధాకర్ హతమయ్యాడు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో భద్రతా దళాలు, నక్సలైట్‌ల మధ్య ఎదురుకాల్పులు జరుగుతున్నాయి. గురువారం నాడు పోలీసు అధికారులు ఈ సమాచారం అందించారు.జిల్లాలోని నేషనల్ పార్క్ ప్రాంతంలో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయని పోలీసు అధికారులు తెలిపారు. మావోయిస్టుల పెద్ద క్యాడర్ ఉన్నారన్న సమాచారం మేరకు భద్రతా దళాల సంయుక్త బృందం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌కు వెళ్లిందని అధికారులు తెలిపారు.భద్రతా దళాల సిబ్బంది ఆ ప్రాంతంలో ఉండగా, ఈ రోజు ఉదయం భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయని ఆయన చెప్పారు. ఈ విషయంలో మరిన్ని వివరాలు సేకరిస్తున్నామని అధికారులు తెలిపారు.

## మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి.



**బేతంచర్ల:**మొక్కలు నాటి కాలుష్యం నుండి పర్యావరణాన్ని రక్షించాలని నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ అన్నారు. గురువారం నాడు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బేతంచర్ల లోని కొత్త బస్టాండ్ నంద్యాల సర్కిల్ వద్ద నగర పంచాయతీ సిబ్బంది, మెప్మా సిబ్బంది ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ నిర్వహించారు అనంతరం ఎంపీడీవో ఫజల్ రెహమాన్, నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణ కాలుష్యాన్ని నివారించడానికి తమ వంతుగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొదుపు మహిళలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## నా చారిత్రక విజయానికి ఏడాది పూర్తి

### - మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్

**బ్రహ్మంగారిమఠం** వైకాపా రాక్షస పాలనకు అంతం పలికి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టిన చారిత్రక సందర్భాన.. నన్ను తొలిసారిగా గెలిపించిన మైదుకూరు నియోజకవర్గ ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదములు. నాకు టికెట్ ఇచ్చి ఆశీర్వదించిన మా ప్రియతమ అధినేత శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, నన్ను సోదరునిలా భావించి అడుగడుగునా అండగా నిలిచిన యువనేత శ్రీ నారా లోకేష్ బాబు గారికి నా జీవితాంతం రుణపడి ఉంటాను.. నా గెలుపు కోసం ఎన్నో నిర్బంధాలు, అక్రమ కేసులను ఎదుర్కొంటూ.. తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలకు ఎన్ని జన్మలెత్తినా రుణం తీర్చుకోలేనన్నారు.నా విజయానికి సహకరించిన నియోజకవర్గ ప్రజలకు జనసేన, బిజెపి కూటమి నాయకులు, కార్యకర్తలందరికీ.. నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు నా జీవితం మైదుకూరు నియోజకవర్గ ప్రజలకే అంకితమని శాసనసభ్యుడు పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు.

### నూర్ భాష దూదేకుల సంఘనీ ఆధ్వర్యంలో

# ఉచిత కంప్యూటర్ శిక్షణ

**బేతంచర్ల:** :నూర్ భాష దూదేకుల సంఘం మరియు సాయి కంప్యూటర్స్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణను నిర్వహిస్తున్నట్లు సాయి కంప్యూటర్స్ ట్రైనింగ్ సెంటర్ అధినేత దస్తగిరి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేతంచర్ల మండలంలోని నూర్ బాషా దూదేకుల నిరుద్యోగ యువతీ యువకులు మరియు ముస్లిం నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని దరఖాస్తు చేసుకోవడానికి పదవ తరగతి పాసైన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని, దరఖాస్తు చేసుకోవడానికి విద్యార్థి యొక్క ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పదవ తరగతి మార్కుల జాబితా, పాస్ ఫోటోతో బేతంచర్ల పట్టణంలోని రెడ్డి హోటల్ ఎదురుగా ఉన్న సాయి కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ నందు సంప్రదించాలని మిగతా వివరాలకు 9603437726 నంబర్ను సంప్రదించాలని కోరారు.

### నేడు మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా

# ప్రమాణ స్వీకారం

**మైదుకూరు** మైదుకూర్ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణములో శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు మైదుకూరు మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్గా ఎ పి రవీంద్ర ప్రమాణ స్వీకారోత్సవం మైదుకూరు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు దాసరి బాబు ప్రకటన తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డు చైర్మన్గా పదవీ బాధ్యతలు చేపడుతున్న సందర్భంగాంఖ రవీంద్ర స్వగృహం నుండి బయలుదేరి శ్రీకృష్ణదేవరాయల కూడలిలో మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ పుట్టా సుధాకర్ యాదవ్ గారి ఆధ్వర్యంలో శ్రీ కృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారన్నారు.

తదనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఐదు ఇప్పుడు మార్కెట్ యార్డ్ చైర్మన్గా ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు అనంతరం భోజన కార్యక్రమం కలదన్నారుఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు, కూటమి నాయకులు, కౌన్సిలర్ లు, సర్పంచ్ లు, టీడీపీ కార్యకర్తలు, తెలుగుదేశం కుటుంబ సభ్యులు, అభిమానులు ఈ కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని కోరుకుంటున్నామన్నారు

## ఖమ్మంలో ఘోర యాక్సిడెంట్.. తండ్రి కొడుకుల మృతి

**ఖమ్మం** కాలేజీలో అడ్మిషన్ కోసం వెళుతుండగా జరిగిన యాక్సిడెంట్లో తండ్రి కొడుకులు మృతి చెందారు. ఖమ్మం ఎన్టీఆర్ సర్కిల్లో గురువారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు మృతిచెందారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం దుబ్బతండాకు చెందిన బాల్య (50), అతడి కుమారుడు సాయికుమార్ ఓ ఇంటర్ కాలేజీలో చేర్పించేందుకు ఖమ్మం వచ్చారు. ఎన్టీఆర్ సర్కిల్ క్రాస్ చేస్తుండగా ఓ లారీ వేగంగా వచ్చి వారిని ఢీకొంది.ఇద్దరు లారీ టైర్లకింద పడి మృతి చెందారు . పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## వియత్నాంలో తెలంగాణ విద్యార్థి మృతి

**కొమురం భీం** వియత్నాంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ విద్యార్థి మృతి చెందారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన బట్టల వ్యాపారి అర్షిద్ అర్జున్, ప్రతిమ దంపతుల కుమారుడు అర్షిద్ అక్షిత్ వియత్నాంలోని కాంతో సిటీలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. అయితే నిన్న తెల్లవారుజామున స్నేహితుడితో బైక్‌పై వెళ్తూ అతి వేగంగా ఓఇంటి గోడను ఢీ కొట్టాడు. దీంతో అక్షిత్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.

### ఇందిరమ్మ ఇండ్ల మంజూరు

# పత్రాల పంపిణీ

**నల్గొండ** మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ జరిగింది. మునుగోడు నియోజకవర్గంలోని చండూర్, మునుగోడు, నాంపల్లి, మర్రిగూడ, ఘట్టుప్పల్ మండలాల లబ్దిదారులకు ఒకే వేదిక పై పంపిణి జరిగింది. ఈ కార్యక్రమంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ నెలికంటి సత్యం, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో పట్టపగలే దోపిడి



**తిరుపతి** తిరుపతిలో పట్టపగలే దోపిడీ జరిగింది. 50 గ్రాముల బంగారం తో పాటు వెండి సామాగ్రిని దొంగ అపహరించాడు. వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గిరిపురంలో ఘటన జరిగింది. మూడవ అంతస్తు లో నివాసం ఉన్న గిరిజ, బాలచంద్ర భార్యాభర్తల ఇంటిలోకి దొంగ ప్రవేశించాడు. భర్త బాత్రూం లో ఉండగా బయట గొళ్ళెం పెట్టి ,భార్య చేతులు, కాళ్ళు కట్టి నోటిలో గుడ్డముక్క కుక్కి చోరీకి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని కి చేరుకొని విచారణ ప్రారంభించారు. ఫింగర్ ప్రింట్ క్లూస్ టీం అధికారులు చేరుకొని ఆధారాలు సేకరించారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసారు వెస్ట్ పోలీసులు.

# సమగ్ర ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోవాలి

### జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్

**జగిత్యాలు** సమగ్ర ఆరోగ్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని జగిత్యాల జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాస్ అన్నారు.. గురువారం జగిత్యాల కొత్త బస్టాండు ప్రాంతాల్లోని కార్మికుల అడ్డాలో సమీకృత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు.. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది హెచ్ఐవి ,టీబి, మధుమేహం,రక్తపోటు పరీక్షలను నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాస్ హాజరై మాట్లాడారు.కార్మికులు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించవద్దని తరచు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.. దీర్ఘకాల వ్యాధులకు మందులు వాడాలని సూచించారు.. సమీకృత ఆరోగ్య శిబిరంలో హెచ్ఐవి, సిఫిలిస్ ,క్షయ వ్యాధి, తోపాటు అసంక్రమిత వ్యాధులు షుగర్ ,బిపి వైరల్ హెపటైటిస్ ఏ,బి,సి, తదితర రక్త పరీక్షలు ఉచితంగా చేయడం జరుగుతుందని అవసరమైన వారికి మందులు ఇస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మంకిడి శ్రీనివాస్,ఐసిటిసి కౌన్సిలర్ రవీందర్, ఎస్ టి ఎస్ శ్రీనివాస్, స్టాఫ్ నర్స్ అనూష , ఎన్జీవో సిబ్బంది తదితరులు ఉన్నారు..

### ప్లాస్టిక్ వాడకాన్ని మానేద్దాం

## పర్యావరణాన్ని కాపాడుదాం




**కోరుట్ల :**ప్లాస్టిక్ వాడకాన్ని మానేద్దాం, పర్యావరణాన్ని కాపాడుదాం అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే ప్రమోద్ అన్నారు.గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోరుట్ల పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె ప్రమోద్ కుమార్ హాజరై మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత, ఆరోగ్యకరమైన పర్యావరణం, ప్రజా ఆరోగ్యనీ మధ్య ఉన్న ముఖ్యమైన సంబంధాన్ని ఈ సందర్భంగా చెప్పారు. “పరిశుభ్రమైన, సురక్షితమైన, స్థిరమైన వాతావరణం మంచి ఆరోగ్యానికి పునాది.” పర్యావరణ కాలుష్యం, అటవీ నిర్మూలన మరియు వాతావరణ మార్పు మన అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయిన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం తీవ్రమైన పర్యావరణ, ప్రజారోగ్యానికి హాని కలిగిస్తుందని, సులభ విధానాలకు అలవాటు పడి, ప్లాస్టిక్ క్యారి బ్యాగులు, డిస్పోజల్ ప్లేట్స్, డిస్పొ గ్లాసులు, లాంటి వివిధ ప్లాస్టిక్ తయారీలను విచ్చలవిడిగా వాడి, బయట పారేయడం వల్ల, అవి జీర్ణం కాక నేల యొక్క సారాన్ని , నీరు ఇంకే స్వభావాన్ని తగ్గిస్తుందని ఆన్నారు. అంతేకాకుండా జలాశయం లో చేరి అందులో నివసించే జీవుల శరీరాల్లో కి, తద్వారా మనశరీరంలో కూడా సూక్ష్మ ప్లాస్టిక్ చేరి, క్యాన్సర్, నాడీ సంబంధ వ్యాధులు, మానసిక వ్యాధులు వంటి అనేక ఆరోగ్య సమస్యలను కలిగిస్తున్నాయిని, వీటివల్ల పర్యావరణ సమతుల్యానికి తీవ్రఆటంకం కలుగుచున్నది. 120 మైక్రన్లకంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్లను మాత్రమే అంతకన్నా ఎక్కువ మైక్రాన్లు ఉన్నా ప్లాస్టిక్ కవర్లను ఎట్టి పరిస్తితుల్లో వాడకూడదన్నారు.సహజ వనరులను ఆచితూచి వాడుకోవలెను,ఎట్టి పరిస్థితిలో అనవసరంగా, విచ్చలవిడిగా వినియోగించరాదు భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన పర్యావరణాన్ని అందించడం మనందరి బాధ్యత ఆనిఅందుకు ఈ క్షణం నుండి అందరం నడుంబిగించాలన్నారు.మార్కెట్ కు వెళ్లేటప్పుడు సంచి, జ్యూట్ బ్యాగు, మటన్ షాపు వెళ్లేటప్పుడు కచ్చితంగా టిఫిన్ బాక్స్ తీసుకుని వెళ్లి,ప్లాస్టిక్ వాడకాన్ని అదుపుచేయాలని, నీటిని పొదుపుగా వాడుకోవాలని, విద్యుత్తును అనవసరంగా వినియోగించవద్దన్నారు. మొక్కలు నాటడం మొక్కలను పరిరక్షించడం మనందరి బాధ్యత తద్వారా వాతావరణ సమ తుల్యానికి సహకరించిన అదుపు చేసిన వాళ్ళమౌతాముని, దేశ రాజధాని అయిన డిల్లి లాంటి మెట్రోపాలిటన్ సిటీలో, తీవ్రమైన వాతావరణ కాలుష్యం వల్ల పాఠశాల కు సెలవు ప్రకటించే పరిస్థితులు ఏర్పడుచున్నవని, అక్కడ ఒకరోజు సరి సంఖ్య మరొక రోజు బేసి సంఖ్య నంబర్ ప్లేట్ ఉన్న వాహనాలను మాత్రమే అనుమతించి, కాలుష్యాన్ని అదుపు చేయడం జరుగుతుంది. అక్కడ ఆక్సిజన్ క్లబ్స్ కూడా ఏర్పాటు చేయడం జరుగుతున్నదన్నారు. అలాంటి పరిస్థితి రాకుండా జాగ్రత్త పడటం మనందరి బాధ్యత అన్నారు .ఈ కార్యక్రమంలో జిల్లా యన్.సి.డి. ప్రోగ్రాం అధికారి డా.అర్చన, , కథలాపూర్, అంబారిపేట్, ఐలాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు డా. సిందుజా, డా. రచన,డా.సమీనా, కోరుట్ల ఏరియా ఆసుపత్రి సుపరిండేంట్ డా. సునీత, వైద్యులు, పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, జిల్లా వైద్యాధికారులు ,సిబ్బంది శ్రీధర్,భూమేశ్వర్, శంకర్, సీనియర్ ఫార్మసీ సూపర్వైజర్ ఉదయ ప్రసాద్, ధనుంజయ్ భూషణ్, వెంకట్ రమణ ఇందీవర శ్యాం,యన్.సి.డి.కోర్డినేటర్ శ్యాం, గర్భిణీలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## భూ భారతి అవగాహన సదస్సును

### - పరిశీలించిన జిల్లా కలెక్టర్



**హుస్నాబాద్** ఈ సదస్సులో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్య కలిగిన ప్రతి ఒక్కరూ మీ గ్రామంలో సదస్సు నిర్వహించే రోజున అర్జీ పెట్టుకోవాలని తెలిపారు. సదస్సులో రెవెన్యూ అధికారులకు మీ సమస్య ఏదైనా సరే క్లుప్తంగా వివరిస్తే సమస్య ఎలా, ఎప్పుడూ, ఎన్ని రోజుల్లో పరిష్కారం అవుతుందో అనే విషయాలను భూ భారతి చట్టం లో పొందుపర్చిన అంశాలు అన్నీ తెలియజేసి సమస్య పరిష్కరిస్తారని తెలిపారు. జిల్లాలో ఈ నెల 20 వరకు నిర్వహిస్తున్న సదస్సుల్లో భూ సమస్య ఉన్న ప్రతి ఒక్కరు పాల్గొనాలని తెలిపారు.భూ స్వాములతో మాట్లాడుతూ. వారి సమస్య విని చట్టం ప్రకారం అతి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. భూ సమస్య కలిగిన ఎవ్వరు అధైర్య పడవద్దని నూతన అర్ ఓ అర్ చట్టం లో ప్రతి సమస్యకు పరిష్కారం దొరుకుతుందనీ సూచించారు.కలెక్టర్ వెంట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీవో రామ్మూర్తి, తహసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## భూ రికార్డులో తప్పులు సవరణ, తదితర భూ సమస్యల పరిష్కరణ

- జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ లత
-రైతులకు మేలు జరిగేందుకు రెవెన్యూ సదస్సులను ఏర్పాటు
- రెవెన్యూ అధికారులు -దరఖాస్తుల స్వీకరణ



జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం రైతులకు ఎంతో ఉపయోగకరంగా తయారయింది. జగిత్యాల జిల్లా పోరండ్ల గ్రామములో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో అడిషనల్ కలెక్టర్ లత ఫాల్గొన్నారు.ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. మిస్సింగ్ సర్వే నెంబర్, వారసత్వం పట్టా, రికార్డులో తప్పులు సవరణ, తదితర భూ సమస్యల పరిష్కరించేందుకు ప్రభుత్వం తీసుకున్న కొత్త చట్టం భూభారతి ద్వారా రైతులకు మేలు జరిగేందుకు రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసి రెవెన్యూ అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్, గిర్దావర్లు భూమయ్య, షేమ్ షోద్దీన్, సీనియర్ సహాయకులు గంగారాం, జూనియర్ సహాయకులు నిరంజన్, శ్రీనివాస్, జయ, సుజాత, రాజేందర్ ఫాల్గొన్నారు.

## యోగా అభ్యాసనతో మానసిక,శారీరక ఆరోగ్యం మెరుగవుతుంది

- బాల్యం నుండే యోగా ను దినచర్య లో భాగస్వామ్యం చేసుకోవాలి
- యోగా శిక్షకులు : శ్రీపతి కృష్ణహరి, అఖిల
- అంతర్జాతీయ యోగ దినోత్సవ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బోయినిపల్లిలో చిన్నారులకు యోగా పోటీలు-బహుమతులు ప్రధానం



బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్) అంతర్జాతీయ యోగ దినోత్సవం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా (ఎనిమిదవ రోజు) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినపల్లి మండల కేంద్రంలో 2025 జూన్ 4 (బుధవారం) చిన్నారుల కోసం యోగా పోటీలు నిర్వహించాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా యోగా శిక్షకులు కృష్ణహరి, అఖిల మాట్లాడుతూ – చిన్నతనం నుంచే యోగా ను నిత్య జీవితంలో దినచర్యగా భాగం చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతూ, జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో బోయినిపల్లి గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొని, చిన్నారులను అభినందించారు.

## సొంత ఇంటి కలను నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం

- గత బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం నిర్లక్ష్యానికి ప్రజా ప్రభుత్వం ఆదరణ
- ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుని ఆనందం- దశాబ్దాల ఆశ నెరవేరిన సుదినం
- ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ఓ లబ్ధిదారు



వేములవాడ, (ప్రశ్న న్యూస్) వేములవాడ నియోజకవర్గం, కథలాపూర్ మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన ఓ లబ్ధిదారుడు తనకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిరుపేదలకు సొంత ఇంటి కలను సాకారం చేస్తున్న తరుణంలో భాగంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసున 6నేపథ్యంలో గురువారం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో సభా ముఖంగా తన ఆనందాన్ని పంచుకుంటూ మాట్లాడుతూ – "గతంలో బీఆర్ఎస్ పార్టీలో పనిచేసినప్పటికీ నన్ను పట్టించుకునే పాపాన పోలేదు. అప్పట్లో ప్రభుత్వం మంజూరు చేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మట్టిలో మింగిపోయింది. దాదాపు పదేళ్లుగా ఒక్క ఇటుక కూడా పేర్చలేదు" అని భావోద్వేగాలతో ఆవేదన వ్యక్తంచేశారు. అయితే ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత, వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ శ్రీ ఆది శ్రీనివాస్ ప్రత్యేక సహకారంతో "ఇందిరమ్మ ఇల్లు" పథకం ద్వారా నేడు తన స్వంత ఇంటి కల నెరవేరుతున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. ఇది నూతన ప్రభుత్వ సంకల్పాన్ని, పేదల పట్ల ఉన్న నిబద్ధతను చాటిచెప్పే ఉదాహరణగా ప్రజలు పేర్కొంటున్నారు.

### ఎమ్మెల్యే సత్యం సేవా మానవతా దృక్పథం

# ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేస్తుంది

- చొప్పదండి నియోజకవర్గ ప్రజల సంక్షేమాభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్న ఎమ్మెల్యే సత్యం
- కాంగ్రెస్ పార్టీ బోయినిపల్లి మండలాధ్యక్షులు : వన్నెల రమణారెడ్డి
- మండల కేంద్రంలో ఘనంగా ఎమ్మెల్యే సత్యం జన్మదిన వేడుకలు..! అన్నదాన సేవలు..!!







బోయినిపల్లి, (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, చొప్పదండి నియోజకవర్గం, బోయినిపల్లి మండల కేంద్రంలో గురువారం చొప్పదండి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం 44వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గురువారం మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు బర్త్‌డే కేక్ కట్ చేసి, హర్షాతిరేకంగా వేడుకలు జరిపారు.

అనంతరం మండలంలోని తడగొండ గ్రామంలోని సాయిబాబా ఆలయంలో మేడిపల్లి సత్యం పేరుమీద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమం అనంతరం అన్నదాన సేవా కార్యక్రమం కూడా నిర్వహించడంతో పాల్గొన్న భక్తులకు, అన్నార్థులకు అన్నదాన ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, తడగొండ గ్రామ కాంగ్రెస్ నాయకులు, మండలానికి చెందిన 23 గ్రామాల గ్రామశాఖల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సత్యమన్న శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి మాట్లాడుతూ "చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రజల సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఆయన సేవా మానవతా దృక్పథం ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేస్తోంది. బీసీల అభివృద్ధి, నిరుపేదలకు ఇళ్లు, వృద్ధులకు పెన్షన్లు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన తదితర రంగాల్లో ఆయన నిరంతరం శ్రమిస్తున్నారు. ఆయనే నిజమైన ప్రజానాయకులు, నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడడంలో వారికి భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించి, ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నాం," అన్నారు. ఈ నేపథ్యంలో బోయినిపల్లి మండల కేంద్రంలో వేడుకలతో ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించాయి.

### పాకిస్తాన్ ముస్లీం కార్డును

# తిరస్కరించిన మలేషియా

మీదీ ఇస్లామిక్ దేశమే, మాదీ ఇస్లామిక్ దేశమే అంటూ ముస్లిం కార్డును ప్లే చేసేందుకు పాకిస్తాన్ చేసిన ప్రయత్నాన్ని మలేషియా తిరస్కరించింది. ఆపరేషన్ సింధూర్, టెర్రరిస్ట్ కార్యకలాపాలకు పాక్ మద్దతు ఇస్తున్న విషయాన్ని వివరించేందుకు మలేషియాకు వెళ్లిన సంజయ్ ఝా నేతృత్వంలోని ప్రతినిధి బృందం కార్యక్రమాలను రద్దు చేయాలని మలేషియాపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించింది. అందుకోసం ముస్లిం కార్డును వాడుకునే యత్నం చేసింది. భారతీయ ప్రతినిధి వర్గం చెబుతున్న విషయాలను పట్టించుకోవద్దని మలేషియాకు నచ్చచెప్పే యత్నం చేసింది పాక్. అయితే మలేషియా ప్రభుత్వం భారత ప్రతినిధివర్గం చేపట్టిన పది కార్యక్రమాలకూ ఆమోదం తెలిపింది. కశ్మీర్ విషయం ఐక్యరాజ్యసమితిలో ఉందని పేర్కొంటూ, ఆపరేషన్ సిందూర్ తో పాటు భారత ప్రతినిధివర్గం చేపట్టే అన్నికార్యక్రమాలను రద్దు చేయాలని పాకిస్తాన్ చేసిన అభ్యర్థనను మలేషియా ప్రభుత్వం పట్టించుకోలేదని భారత ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మలేషియాలోని పాక్ రాయబార కార్యాలయం ఇందుకు తీవ్రంగా కృషి చేసింది.సంజయ్ ఝా నేతృత్వంలోని ప్రతినిధివర్గం జపాన్, దక్షిణకొరియా, సింగపూర్, మలేషియాలలో పర్యటన పూర్తి చేసుకుని చివరిగా మలేషియాకు శనివారం నాడు చేరుకుంది.జేడీయూ ఎంపీ సంజయ్ ఝా ఆధ్వర్యంలో మలేషియాకు వెళ్లిన బృందంలో బీజేపీ ఎంపీలు అపరాజిత సారంగి, బ్రిజ్ లాల్, ప్రధాన్ బారుహ్ , హేమంగ్ జోషి, తృణమూల్ కాంగ్రెస్ కు చెందిన అభిషేక్ బెనర్జీ, సీపీఎం



ప్రతినిధఇ జాన్ బ్రిట్టాస్, కాంగ్రెస్ కు చెందిన సల్మాన్ కుర్షీద్, మోహన్ కుమార్, ఫ్రాన్స్ మాజీ రాయబారి ఉన్నారు. మాజీ ప్రధాని మహతీర్ మొహమ్మద్ కేబినెట్ లోని మాజీ మంత్రి వైబి సిమ్ త్జిత్జిన్ ఆధ్వర్యంలి మలేషియా బృందాన్ని వారు కలిసి, ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి కారణాలు, టెర్రరిజాన్ని నిర్మూలించేందుకు భారత్ సంకల్పాలను వారికి వివరించారు.

## మనీశ్ సిసోడియా, సత్యేంద్ర జైన్‌లకు సమన్లు

న్యూఢిల్లీ : ఢిల్లీలోని పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణాల్లో అవినీతికి పాల్పడ్డారంటూ ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్‌లపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. తాజాగా ఈ కేసులో అవినీతి నిరోధక శాఖ వీరికి సమన్లు జారీ చేసింది. ఈనెల 6న సత్యేందర్, 9న సిసోడియా ఢిల్లీ లోని బ్యూరో కార్యాలయానికి రావాలని అందులో పేర్కొంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం .. ఆప్ ప్రభుత్వహయాంలో సిసోడియా విద్యాశాఖ మంత్రిగా, సత్యేందర్ జైన్ పబ్లిక్ వర్క్ డిపార్ట్‌మెంట్ (పీడబ్లుడీ ) మంత్రిగా ఉన్నారు. వారి నేతృత్వంలో ఢిల్లీలో 12,748 పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణం తలపెట్టారు. ఈ నిర్మాణంలో రూ. 2 వేల కోట్ల అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. 34 మందికి దీని కాంట్రాక్టులు దక్కగా, వారిలో చాలా మందికి ఆప్‌తో దగ్గర సంబందాలు ఉన్నట్టు తేలింది. నిర్ణీత గడువులోగా నిర్మాణాలు పూర్తి కాకపోగా, భారీగా ఖర్చు చేశారు. తరగతి గదులను 30 సంవత్సరాలు ఉండేలా కడితే , వాటికి అయిన ఖర్చు మాత్రం చాలా ఎక్కువగా ఉంది. గడువు ప్రక్రియను పాటించకుండా కన్సల్టెంట్లు, ఆర్కిటెక్ట్ లను నియమించుకోవడంతో వ్యయం దాదాపు ఐదు రెట్లు పెరిగిపోయింది. ఇటీవల సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) ఇచ్చిన నివేదికలో తరగతి గదుల నిర్మాణ ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయని పేర్కొంది. కొత్త టెండర్లు తీసుకోకపోవడంతో ఈ ప్రాజెక్టువ్యయంరూ.326కోట్లుపెరిగిందనిరిపోర్టులోతెలిపింది.సిసోడియా, జైన్‌లను విచారించేందుకు మార్చిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపడంతో ఏప్రిల్‌లో వీరిపై కేసు నమోదైంది.

## రాహుల్ గాంధీని మందలించిన అలహాబాద్ హైకోర్టు

భారత్ జోడో యాత్ర సందర్భంగా భారతీయ సైనికులను కించపరచే విధంగా వ్యాఖ్యలు చేసినందుకు కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని అలహాబాద్ హైకోర్టు బుధవారం నాడు మెత్తగా మందలించింది. 2022లో భారత్ జోడో యాత్ర సందర్భంగా భారత సైన్యం పరువు కు భంగం కలిగించే విధంగా చేసిన వ్యాఖ్యలకు సంబంధించి లక్నో కోర్టు జారీ చేసిన సమన్లను సవాల్ చేస్తూ రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్ ను తిరస్కరిస్తూ, అలహాబాద్ హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. భారత రాజ్యాంగం ఆర్టికల్ 19కింద వాక్ స్వాతంత్రం, భావ ప్రకటనా స్వేచ్ఛకు హామీ ఇస్తుంది.అయితే ఆ స్వేచ్ఛకూ కాస్త పరిమితి ఉంటుంది. భారత సైన్యానికి పరువు నష్టం కలిగించే ప్రకటనలు చేసే స్వేచ్ఛ అందులో లేదని కోర్టు స్పష్టం చేసింది.2022లో రాజస్థాన్ లో మీడియా సమావేశంలో రాహుల్ ప్రసంగిస్తూ, అరుణాచల్ ప్రదేశ్ లో భారత సైనికులను చైనా దళాలు దెబ్బతీస్తున్నాయని వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపైనే ఆయనపై పరువునష్టం దావా వేశారు.భారత్ జోడో యాత్ర గురించి ప్రజలు అడుగుతారని, కాంగ్రెస్ పార్టీలో లుకలుకలు, గెహ్లాట్, సచిన్ పైలెట్ గురించి, అడుగుతారని, చైనా 2వేల చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని ఆక్రమించిందని, 20 మంది భారతసైనికులను చంపిందని, అరుణాచల్ ప్రదేశ్ లో చైనా సైనికులు భారత సైనికులను దెబ్బతీశారని ఈ విషయాలపై ఒక ప్రశ్నకూడా అడగరని, భారతీయ పత్రికలు దీనిని ప్రశ్నించవని రాహుల్ గాంధీ అప్పట్లో మీడియా సమావేశంలో వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై ఉత్తరప్రదేశ్ లో రాహుల్ పై పరువునష్టం కేసు దాఖలైంది. కింది కోర్టు ఆయనకు సమన్లు జారీ చేసింది. దీంతో రాహుల్ అలహాబాద్ హైకోర్టు ను ఆశ్రయించి, విచారణను, సమన్లను రద్దుచేయాలని కోరారు.

## కమల్‌హాసన్ రాజ్యసభ నామినేషన్ వాయిదా

న్యూఢిల్లీ : థగ్‌లైఫ్ సినిమా ఈవెంట్‌లో కన్నడ భాషపై మక్కల్ నీది మయ్యం (ఎంఎన్‌ఎం) పార్టీ అధినేత , ప్రముఖ నటుడు కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగిన సంగతి తెలిసిందే. ఈ భాషా వివాదం నేపథ్యంలో ఆయన రాజ్యసభ స్థానానికి నామినేషన్ దాఖలు చేయడాన్ని వాయిదా వేసుకున్నట్టు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. త్వరలో విడుదల కాబోయే తన చిత్రం థగ్‌లైఫ్ వ్యవహారాలు పూర్తయిన తర్వాతే నామినేషన్ వేయాలని భావిస్తున్నట్టు తెలిపాయి. కమల్ 2018లో ఎంఎన్‌ఎం పార్టీని స్థాపించారు. విపక్ష ఇండియా కూటమిలో ఇది భాగం. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులో డీఎంకే, కాంగ్రెస్ కూటమికి మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒప్పందంలో భాగంగా రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలు, పుదుచ్చేరి లోని ఒక స్థానంలో ఎంఎన్‌ఎం ప్రచారం చేసింది. 2025 ఎగువసభ ఎన్నికల్లో ఎంఎన్‌ఎం పార్టీకి రాజ్యసభ స్థానం ఇచ్చేందుకు డీఎంకే నేతృత్వం లోని కూటమి అంగీకరించింది.ం

2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో డీఎంకేతో కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం ఎంఎన్‌ఎంకు ఎగువసభ స్థానం కేటాయించారు. దీంతో కమల్‌హాసన్ రాజ్యసభకు వెళ్లనున్నారనే విషయాన్ని డీఎంకే ఎంఎన్‌ఎం ఇటీవల ఖరారు చేశాయి. ఇటీవల నిర్వహించిన థగ్‌లైఫ్ సినిమా ఈవెంట్‌లో తమిళం నుంచే కన్నడ పుట్టిందని కమల్ వ్యాఖ్యానించడంతో భాషా వివాదం మొదలయ్యింది. కమల్ వ్యాఖ్యలను కన్నడ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో కర్ణాటకలో థగ్‌లైఫ్ చిత్రాన్ని నిషేధించాలని కోరుతూఏ ఆ రాష్ట్ర ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (కేఎఫ్‌సిసీ ) హైకోర్టును ఆశ్రయించింది. ఆ పిటిషన్‌ను మంగళవారం విచారించిన న్యాయస్థానం కమల్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. క్షమాపణ చెబితే అన్నీ పరిష్కారమయ్యేవని వ్యాఖ్యానించింది.దీంతో ఈ చిత్రాన్ని కర్ణాటకలో ప్రస్తుతానికి విడుదల చేయకూడదని కమల్‌హాసన్ నిర్ణయించారు. అనంతరం తన వ్యాఖ్యలను అపార్థం చేసుకున్నారంటూ కేఎఫ్‌సీసీకి కమల్ లేఖ రాశారు. అయితే అందులోనూ సారీ చెప్పకపోవడం గమనార్హం.

### యూఎస్ అణు ప్రతిపాదనకు

# ఇరాన్ తిరస్కరణ

అమెరికా అణు ఒప్పంద ప్రతిపాదనను ఇరాన్ సుప్రీం నేత అయాతుల్లా ఖామినేని బుధవారం తిరస్కరించారు. ఇది ఇరాన్ జాతీయ ప్రయోజనాలకు విరుద్ధమని స్పష్టం చేశారు. తమ దేశం యురేనియం సుసంపన్నతను వదులుకోదని ఉద్ఘాటించారు. అమెరికా మరియు ఇరాన్ మధ్య చర్చల్లో యురేనియం కీలకాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఇరాన్ అణు కార్యక్రమానికి యురేనియం సంపద కీలకమని అన్నారు.

దశాబ్దాల నాటి అణు వివాదాన్ని ముగించాలనే అమెరికా ప్రతిపాదనను ఇరాన్ తిరస్కరించడానికి సిద్ధంగా ఉందని సోమవారం ఇరాన్ దౌత్యవేత్త ఒకరు ప్రకటించారు. యురేనియం సంపదపై అమెరికా వైఖరిని సున్నితంగా చేయడం లేదా ఇరాన్ ప్రయోజనాలను పరిష్కరించడంలో విఫలమయ్యే 'ప్రారంభించనిది' అని తోసిపుచ్చారు. శాంతియుత ప్రయోజనాల కోసం అణుసాంకేతికలో ప్రావీణ్యం సంపాదించాలని భావిస్తున్నట్లు ఇరాన్ పేర్కొంటోంది. అయితే ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తోందన్న పాశ్చాత్యదేశాల ఆరోపణలను తోసిపుచ్చింది.

# భూ భారతి చట్టం రైతులకు వరం లాంటిది. కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ ప్రతినిధి ప్రశ్న (న్యూస్)** ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతం గా ఉన్న భూ సమస్యలు పరిష్కరించేందుకే భూ భారతి(ఆర్.ఓ.ఆర్.) రికార్డ్స్ ఆఫ్ రైట్స్ యాక్ట్ ప్రవేశపెట్టడం జరిగిందని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కోరారు.గురువారం కొల్చారం మండలం రంగంపేట గ్రామం భూభారతి రెవెన్యూ సదస్సు కలెక్టర్ సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడారు. భూభారతి విశిష్టతను తెలియజేశారు. హెల్ప్ డెస్కుని వినియోగించుకోవాలని సూచించారు. దరఖాస్తులను నింపడంలో పొరపాట్లు చేయరాదని చెప్పారు. అధికారులు కూడా సంబంధిత లబ్ధిదారులతో ముందుగా మాట్లాడాలని, వారి సమస్యలు తెలుసుకోవాలని, తద్వారా పరిష్కరించడం సులభతర మవుతుందన్నారు.రికార్డులలో ఉన్న తప్పులను సరి చేయడం జరుగుతుందని లబ్ధిదారులు కూడా సహనం పాటించాలన్నారు. %వా%భూభారతిలో ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందని, అందుకు కావలసిన పత్రాలను కూడా సమర్పించాలన్నారు. ఏమైనా సందేహాలు, అపోహలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు.కలెక్టర్ వెంట కొల్చారం ఎమ్మార్వో శ్రీనివాస్ చారీ సిబ్బంది లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

## జార్జిరెడ్డి పి డి ఎస్ యు విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నరేష్ రత్న

మంథని,( ప్రశ్న న్యూస్) పెద్దపల్లి జిల్లా ఇంటర్మీడియట్ విద్యశాఖ అధికారి డి ఐ ఈ ఓ కార్యాలయంలోని ఖాళీ కుర్చీకి వినతి పత్రం జార్జిరెడ్డి పి డి ఎస్ యు, ప్రభుత్వ జూనియర్ కళాశాల లో మౌలిక సదుపాయాలు మెరుగు పరచాలని, నిబంధనలు పాటించని ప్రైవేటు, కార్పోరేట్ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జార్జిరెడ్డి పి డి ఎస్ యు రాష్ట్ర కమిటి పిలుపులో భాగంగా జిల్లా కమిటి ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి కార్యాలయంలో అందుబాటులో లేకపోవడం, ఆఫీస్ లోని ఇతర అధికారులు ఎవరు బాధ్యతాయుతంగా లేకపోవడంతో ఖాళీ కుర్చీకి వినతి పత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జార్జిరెడ్డి పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు నరేష్ రత్న, కార్యదర్శి శివ లు మాట్లాడుతూ తెలంగాణలో విద్యా ప్రారంభం ఐనా కానీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం అయిందని అన్నారు. ప్రైవేట్, కార్పోరేట్ విద్యా సంస్థలు నిబంధనలు పాటించడం లేదని అన్నారు. నిబంధనలు పాటించని ప్రైవేటు, కార్పోరేట్ విద్యా సంస్థలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నూతన విద్యా సంవత్సరంలో అయినా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి స్థాయిలో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పోరేట్ జూనియర్ కాలేజీలు అనుమతులు లేకుండా వేరు వేరు బిల్డింగులలో క్లాసులు నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో త్రాగు నీరు కోసం మినరల్ వాటర్ వసతి, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు వంటి కనీస వసతులు కల్పించాలని అన్నారు. సైన్స్ కోర్సు విద్యార్థులు అవసరాలకు తగిన విధంగా ప్రాక్టికల్స్ కోసం కెమికల్స్ ను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని అన్నారు. ఒకేషనల్ కోర్సు విద్యార్థుల విద్యా అవసరాలకి తగిన విధంగా వర్క్ షాప్స్ వసతి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల అన్ని రకాల సమస్యలు సకాలంలో పరిష్కరించాడానికి జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు దృషి కేంద్రీకరించాలని డిమాండ్ చేశారు. లేని యెడల విద్యార్థి పోరాటాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో



# ఉద్యమ కళాకారుల సమస్యలను

# ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా

- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్
- తెలంగాణ ఉద్యమకారుల హామీలపై వినతిపత్రం అందజేత

వేములవాడ,(ప్రశ్న న్యూస్) తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఆధ్వర్యంలో ఉద్యమ కళాకారుల శ్రేయస్సు కోసం వివిధ డిమాండ్లను నెరవేర్చాలని వినతిపత్రంగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, పొలిటికల్ అఫైర్స్ కమిటీ,డీలిమిటేషన్ కమిటీ సభ్యులు ఆది శ్రీనివాస్ కు గురువారం వినతిపత్రం అందజేశారు. వేములవాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం రాష్ట్ర కన్వీనర్, కళాతపస్వీ యెల్ల పోశెట్టి వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఉద్యమకారులకు, కళాకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25,000 పెన్షన్ వంటి హామీలు ఇచ్చిందని, వాటి అమలుపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

**వినతిపత్రంలోని ముఖ్య హామీలు:**

- ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు జారీ చేసేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ యువ వికాస్ పథకాలలో 20% రిజర్వేషన్
- కళాకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ.10,000 కోట్ల బడ్జెట్ కేటాయింపు
- 'తెలంగాణ సాంస్కృతిక సారధి'లో 1000 ఉద్యోగాలు ఉద్యమ కళాకారుల కోసం కేటాయింపు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, తమ



వినతులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, తగిన మేరకు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉత్తర తెలంగాణ కళాకారుల కో-ఆర్డినేటర్ బొడ్డు రాములు, జిల్లా అధ్యక్షులు బొజ్జ కనకయ్య, వారాల దేవయ్య, ప్రధాన కార్యదర్శి మనువాడ లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కనపర్తి హనుమాండ్లు, బుర్రి శంకరయ్య, వెన్నమల్ల వెంకటేష్, వెంపటి సంతోష్ కుమార్, మామిండ్ల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సత్యం పుట్టినరోజు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు..! అన్నదాన సేవలు..!!

- చొప్పదండి నియోజకవర్గాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న ఎమ్మెల్యే సత్యం
- కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు : మ్యాన కరుణాకర్



బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్) చొప్పదండి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మ్యాన కరుణాకర్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం స్తంభంపల్లి సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే సత్యం పేరున ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన సేవా కార్యక్రమాన్ని నిర్వహించి,అన్నా ర్థులకు,భక్తులకు అన్నదాన ప్రసాదం వితరణ చేశారు. అనంతరం మ్యాన కరుణాకర్ మాట్లాడుతూ "నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కి పాటుపడడంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని" ఆకాంక్షించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకట రమణారెడ్డి,ఆలయ ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అత్యంత వైభవోపేతంగా

# శ్రీ గంగాభవాని పార్వతి రాజరాజేశ్వరుని కళ్యాణం

- గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు
- కళ్యాణానికి హాజరై దర్శించుకున్న ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్





**వేములవాడ, (ప్రశ్న న్యూస్)** వేములవాడ పట్టణంలోని మూలవాగులో వెలిసిన శ్రీ గంగాభవాని దేవాలయంలో గురువారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శ్రీ గంగాభవాని పార్వతి రాజరాజేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం అర్చకుల వేదమంత్రోచ్చరణల మధ్య స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు కళ్యాణం నిర్వహించగా, భక్తులు పెద్దఎత్తున హాజరై దర్శించుకొని పునీతులయ్యారు. ప్రతీ సంవత్సరం గంగమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తూ వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు పుష్కలంగా పండాలని భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు.
ఈ సందర్భంగా వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ శ్రీ ఆది శ్రీనివాస్ కార్యక్రమానికి హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, "వేములవాడ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నా. గంగమ్మ గుడికి వెళ్లే రహదారి,బ్రిడ్జ్ నిర్మాణానికి నిధులు త్వరలోనే మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తాం.గుడి పరిసరాల్లో మురుగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభించాం. భక్తులకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుంది" అని పేర్కొన్నారు.కళ్యాణ మహోత్సవం లో భాగంగా గంగపుత్ర సంఘం నేతలు అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షులు కూర పర్శయ్య, సొసైటీ అధ్యక్షులు పంపరి శంకర్ తో పాటు కూర దేవయ్య, పంపరి దేవయ్య, అశోక్, పూస రమేష్, కూర లక్ష్మణ్, గోపాల్, అంజయ్య, అనిల్, దివిటి శంకర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు. అనేకమంది మహిళలు ఈ వేడుకల్లో పాల్గొని స్వామి దంపతులను దర్శించుకున్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

## జిల్లా మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని జిల్లా మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు అన్నారు. మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని రైతు వేదికలో మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు సమక్షంలో విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను అందజేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగా విత్తనాల స్వయం సమృద్ధి లక్ష్యంగా నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు రేగు రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త టి లావణ్య, మేడ్చల్ మండల వ్యవసాయ అధికారిని అర్చన, మేడ్చల్ వ్యవసాయ విస్తరణ అధికారిని తేజస్విని మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ మండల అధ్యక్షుడు, రమణ రెడ్డి, పుదూర్ సొసైటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, రామ కృష్ణ రెడ్డి, మురళి గౌడ్, హనుమంత రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వాడుక నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు : ఐల శివరాం



బోయినిపల్లి, (ప్రశ్న న్యూస్) ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐల శివరాం పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కార్యోన్ముఖులు కావాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని మనం కాపాడితే అదే మనల్ని కాపాడుతుందన్నారు. ఈ ఏడాది పర్యావరణ దినోత్సవ ప్రధానాంశమైన "ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణకు కట్టుబడి ఉందామని,సహజ వనరుల సంపదను రాబోయే తరాలకు అందించాలన్నదే ప్రజా ప్రభుత్వ ధృక్పథమని"ఐల శివరాం పేర్కొన్నారు.

# బీజేపీ వేములవాడ పట్టణ కార్యదర్శిగా బచ్చు వంశీకృష్ణ నియామకం

- వంశీకృష్ణ కు నియామక పత్రం అందజేత-శుభాకాంక్షలు
- భాజపా వేములవాడ పట్టణాధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్




వేములవాడ,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,భారతీయ జనతా పార్టీ వేములవాడ పట్టణ శాఖ కార్యదర్శిగా బచ్చు వంశీకృష్ణ నియమిస్తూ గురువారం పట్టణ బీజేపీ అధ్యక్షులు డా. రాపెల్లి శ్రీధర్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా భాజపా పట్టణాధ్యక్షులు శ్రీధర్ మాట్లాడుతూ, "బచ్చు వంశీకృష్ణ పార్టీలో చేరిన నాటినుంచి చురుకుగా కార్యకలాపాల్లో పాల్గొంటూ, పలు కార్యక్రమాలలో పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి పట్టణ కార్యదర్శిగా నియమించాం. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుంది" అని తెలిపారు.అనంతరం భాజపా పట్టణ నూతన కార్యదర్శి బచ్చు వంశీకృష్ణ మాట్లాడుతూ, "నాపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన పట్టణ అధ్యక్షులు డా. రాపెల్లి శ్రీధర్,భాజపా జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి,కాషాయ దళపతి ప్రతాప రామకృష్ణ,అలాగే పార్టీ సీనియర్ నాయకులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నాను. బీజేపీ బలోపేతం కోసం నేను పూర్తిగా అంకితభావంతో పనిచేస్తాను" అని తెలిపారు.

# తెలంగాణ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

-రాష్ట్ర మంత్రులకు లాయర్స్ ఇండియా ఆర్గనైజేషన్ వినతి



**మంథని(, ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న దాదాపు 50 వేల మందికి పైగా ఉన్న న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ గురువారం రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు మరియు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి లకు లాయర్స్ ఇండియా ఆర్గనైజేషన్ న్యాయవాదుల బృందం వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం జరగనున్న తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో తమ సమస్యలను ప్రస్తావించాలని కోరడం జరిగింది. ఈ మేరకు 50 వేల మంది పైగా న్యాయవాదుల మరియు వారి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో లో పేర్కొన్న 10 లక్షల వరకు హెల్త్ కార్డులు వెంటనే పునరుద్దరణ చేయాలని, అదేవిధంగా జూనియర్ న్యాయవాదులకు 5వేల రూపాయల స్టైఫండ్ ఇవ్వాలని,అలాగే నోటరి నోటిఫికేషన్ విడుదల చేయాలని,న్యాయవాదుల కు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని, నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న హైకోర్టు ప్రాంగణంలో దివ్యాంగులైన న్యాయవాదులకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, దివ్యాంగుల చట్టం 2016 మేరకు హైకోర్టు ప్రాంగణంలో తగు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని,వివిధ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆ వినతిపత్రంలో కోరారు..ఈ కార్యక్రమంలో లాయర్స్ ఇండియా ఆర్గనైజేషన్ జాతీయ ప్రధానకార్యదర్శి పొన్నం రవీందర్, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇనుముల సత్యనారాయణ, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆలె నర్సింహా,హైకోర్టు సీనియర్ న్యాయవాదులు ఆంటోనీ రెడ్డి , కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.



## నన్ను ఇష్టపడని వారు కూడా

# నాకు మెసేజ్‌లు పెడుతున్నారు..

### – శృతి హాసన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్

కమల్ గారాల పట్టి శృతి హాసన్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. ఈ అమ్మడు నటిగా, సింగర్‌గా అదరగొడుతుండడం మనం చూస్తూనే ఉన్నాం. కొన్నిసార్లు స్వయంగా మ్యూజిక్ కంపోజ్ కూడా చేస్తుంది. అయితే శృతి హాసన్ తన తండ్రి నటించిన 'థగ్ లైఫ్' మూవీ కోసం 'విన్వెలి నాయకన్' అంటూ సాగే పాట పాడి అలరించింది. అర్ధవంతమైన సాహిత్యం, రెహమాన్ స్వర రచన, శృతి హాసన్ మెస్మరైజింగ్ వాయిస్ వలన ఈ పాటకి అశేష ఆదరణ లభిస్తుంది. ఇటీవల ఈ మూవీకి సంబంధించిన ప్రమోషన్ కార్యక్రమంలో కూడా ఈ పాటను స్టేజ్‌పై పాడి అదరగొట్టింది.తన తండ్రి ముందు శృతి హాసన్ అదిరిపోయే పర్‌ఫార్మెన్స్ ఇవ్వడంతో ఫ్యాన్స్ కూడా ఫుల్ ఖుష్ అయ్యారు. అయితే ఈ రోజు థగ్ లైఫ్ రిలీజ్ సందర్భంగా తన అనుభూతిని అభిమానులతో పంచుకుంది శృతి హాసన్. థగ్ లైఫ్ చిత్రంలో పాట పాడడం నాకు జీవిత కాల అనుభవం. నాకు ఇలాంటి అవకాశం వస్తుందని కలలో కూడా ఊహించలేదు. తండ్రి మూవీలో పాట పాడే అదృష్టం ఎంత మంది కూతుళ్లకి దక్కుతుందో తెలియదు కాని నిజంగా నాకు ఇదొక లైఫ్ టైమ్ ఎక్స్‌పీరియెన్స్. పాటను అద్భుతంగా ఆలపించానని రోజు వందలకొద్ది మెసేజ్‌లు వస్తున్నాయి. నేను నచ్చని వాళ్లు కూడా నాకు మెసేజ్‌లు చేస్తున్నారు. ఇంటివద్ద పియానో మీద ఈ పాట రిహార్సల్స్ చేశాను. రికార్డింగ్ సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురి కాలేదు. నా కెరీర్‌లో ఇది మెమోరబుల్ సాంగ్ అని శృతి పేర్కొంది.కాగా, 2009లో కమల్ హాసన్ నటించిన 'ఈనాడు' సినిమాకి శృతి హాసన్ సంగీతం సమకూర్చిన విషయం తెలిసిందే. ఇందులో రీమిక్స్ తో కలిపి ఐదు పాటలకు ట్యూన్స్ కంపోజ్ చేయగా, అందులో మూడు పాటలను తనే స్వయంగా పాడింది. దాదాపు 16 ఏళ్ల తర్వాత మళ్ళీ తన తండ్రి కోసం గళం విప్పిన ఈ ముద్దుగుమ్మ 'విన్వెలి నాయకన్' అంటూ తన ఎనర్జిటిక్ పెర్ఫామెన్స్ తో అదరగొట్టేసింది. థగ్ లైఫ్ చిత్రం నేడు విడుదల కాగా, మూవీకి మంచి టాక్ వచ్చింది.. లెజండరీ దర్శకుడు మణిరత్నం ఈ మూవీని తెరకెక్కించగా ఈ చిత్రంలో కమల్ హాసన్ తో పాటు శింబు, త్రిష, కృష్ణన్ ప్రధాన పాత్రల్లో నటించారు.

## ఓటీటీలోకి వచ్చేసిన దుల్కర్ సల్మాన్

# 'ఒక యముడి ప్రేమకథ'




తెలుగులో సీతారామం, లక్కీ భాస్కర్ వంటి వరుస బ్లాక్‌బస్టర్ అందుకున్నాడు దుల్కర్ సల్మాన్ వచ్చింది మలయాళం నుంచే అయిన తెలుగులో మినిమం గ్యారంటీ హీరోలా మారిపోయాడు ఈ కుర్రహీరో. అయితే దుల్కర్ నటించిన మరో మలయాళ చిత్రం తాజాగా తెలుగులో ఓటీటీలోకి వచ్చేసింది. దుల్కర్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఒరు యమండన్ ప్రేమకథ'. సంయుక్త మీనన్ కథానాయికగా నటించింది. ఈ సినిమాను తాజాగా తెలుగులో తీసుకువచ్చింది భవాని మీడియా. ఆహా ఓటీటీ వేదికగా ఈ సినిమాను 'ఒక యముడి ప్రేమకథ' పేరుతో విడుదల చేసింది. ఈ సినిమా ప్రస్తుతం ఆహా వేదికగా స్ట్రీమింగ్ అవుతుంది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఈ చిత్రం జాన్ అలియాస్ లల్లూ (దుల్కర్ సల్మాన్) అనే పెయింటర్ కథ. జాన్ ప్రేమ వివాహం చేసుకోవాలని కలలు కంటాడు. ఒకరోజు వార్తాపత్రికలో దియా (నిఖిలా విమల్) అనే అమ్మాయి ఫోటో చూసి, ఆమెను ఇష్టపడతాడు. తన స్నేహితులతో కలిసి ఎంత ప్రయత్నించినా దియా ఆచూకీ దొరకదు. అయితే కొంతకాలం తర్వాత, దియా హత్యకు గురైందని జాన్‌కు తెలుస్తుంది. దీంతో హంతకులపై ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకుంటాడు. ఆ తర్వాత ఏం జరిగింది? అసలు దియాను హత్య చేసిందెవరు? ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే.

# హీరోయిన్లు ఆట బొమ్మలు కాదు



**హీరోయిన్ నిత్యా మీనన్ సోషల్ మీడియాలో ఒక్కోసారి ఉన్నట్టుండి ఫైర్ అవుతూ ఉంటుంది. ఇప్పుడు కూడా అలాంటి సందర్భమే వచ్చింది. తన తప్పు లేకుండా ట్రోలింగ్ చేస్తున్న ఓ బ్యాచ్ కు ఆమె తిరుగులేని కౌంటర్ ఇచ్చింది. ఇంతకీ విషయం ఏంటంటే.. ఇటీవల ఓ కార్యక్రమానికి హాజరైంది నిత్యా మీనన్. అక్కడికి ఆమె అభిమానులు చాలామంది వచ్చారు. ఓ అభిమాని, ఆమెకు దగ్గరగా వెళ్లాడు. షేక్ హ్యాండ్ ఇవ్వడానికి ప్రయత్నించాడు. కానీ నిత్యామీనన్ మాత్రం షేక్ హ్యాండ్ ఇవ్వలేదు. అతడికి రెండు చేతులతో నమస్కారం పెట్టి వెళ్లిపోయింది. ఆ వెంటనే స్టేజ్ ఎక్కిన ఆమె, ఓ నటుడిని మాత్రం కౌగిలించుకొని షేక్‌హ్యాండ్ ఇచ్చింది. దీనిపై చాలామంది ఆమెను విమర్శించారు. ఈ విమర్శలపై నిత్యా మీననే స్పందించింది. చాలామంది మమ్మల్ని ఈజీగా టచ్ చేయొచ్చనే ఆలోచనతో ఉంటారని, హీరోయిన్లు ఆట బొమ్మలు కాదనే విషయాన్ని అంతా గుర్తించాలంటూ కౌంటర్ ఇచ్చింది.**



## సగం పారితోషికం

# వాపస్

సిద్ధు జొన్నలగడ్డ నటించిన 'జాక్' చిత్రం ప్రేక్షకులను అంతగా మెప్పించలేకపోయింది. బాక్సాఫీస్ వద్ద కూడా ఈ సినిమాకు ఆశించిన స్థాయిలో వసూళ్లు రాలేదు. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇటీవలే ఈ చిత్రం ఓటీటీలో రిలీజైంది. ఈ సినిమా విషయంలో నిర్మాతలు భారీగా నష్టపోవడంతో తాను తీసుకున్న పారితోషికంలో సగం ప్రొడ్యూసర్స్‌కు తిరిగిచ్చేశాడట హీరో సిద్ధు జొన్నలగడ్డ. ప్రస్తుతం ఈ వార్త సోషల్‌మీడియాలో బాగా ప్రచారమవుతున్నది. 'జాక్' సినిమాకు సిద్ధు 9కోట్ల వరకు రెమ్యునరేషన్ తీసుకున్నారని, అందులో నాలుగుకోట్ల వరకు వాపస్ చేశారని టాక్. సిద్ధు సహృదయాన్ని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. ఇలాంటి చర్యలు నిర్మాతలకు ఊరటనిస్తాయని అంటున్నారు. ప్రస్తుతం సిద్ధు జొన్నలగడ్డ 'తెలుసుకదా' చిత్రంలో నటిస్తున్నారు. నీరజ కోన దర్శకురాలు. అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకురానుంది.

# నిర్మాతలకు అండగా పవన్, సిద్ధు



ఎన్నో ఆశలు పెట్టుకుని కోట్ల పెట్టుబడి పెట్టిన సినిమాలు ఫ్లాప్ అయినప్పుడు లేదా రిలీజ్ కోసం అష్టకష్టాలు పడుతున్నప్పుడు కొందరు హీరోలు అది తమకు సంబంధం లేని వ్యవహారంలా దూరం ఉంటారు. నటించాం, డబ్బులు తీసుకున్నాం అక్కడితో అయిపోయిందనే ధోరణి ఎక్కువ శాతం కనిపిస్తుంది. కానీ పవన్ కళ్యాణ్, సిద్దు జొన్నలగడ్డ దీనికి భిన్నంగా వ్యవహరించడం మంచి సంకేతాలు ఇస్తోంది.

హరిహర వీరమల్లు కోసం తాను తీసుకున్న అడ్వాన్స్ పదకొండు కోట్లను నిర్మాత ఏఎం రత్నంకు వెనక్కు ఇవ్వాలని పవన్ నిర్ణయించుకున్నట్టుగా వచ్చిన వార్త వీరమల్లుకి పెద్ద రిలీఫ్ కానుంది.సిద్ధూ జొన్నలగడ్డ జాక్ వల్ల నిర్మాత బివిఎస్ఎన్ ప్రసాద్ తీవ్రంగా నష్టపోయారు. బ్రేక్ ఈవెన్ లో సగం కూడా వసూలు కాకపోవడం డిజాస్టర్ స్థాయిని పెంచింది. ఇందుకు గాను సిద్ధూ తాను తీసుకున్న రెమ్యునరేషన్ లో సగానికి పైగా వెనక్కు ఇచ్చినట్టు మరో అప్డేట్. ఇది నాలుగున్నర కోట్ల దాకా ఉండొచ్చని ఇన్ సైడ్ టాక్. ఈ రెండు పరిణామాలకు సంబంధించి అధికారిక ప్రకటనలు, ఫోటోలు రాలేదు కానీ విశ్వసనీయ సమాచారం మేరకు ఇవాళో రేపో ఈ లాంఛనం జరగనుందని తెలిసింది. జాక్ ఫలితం మరీ ఇంత తీవ్రంగా వస్తుందని ఊహించని సిద్ధూ ప్రొడ్యూసర్ కు ఉపశమనం కలిగించడం ఆహ్వానించాల్సిందే. ఇలా జరగడం మొదటిసారి కాదు. జానీ టైంలో పవన్ కళ్యాణ్, బాబా అప్పుడు రజనీకాంత్ ఇదే తరహాలో రెమ్యునరేషన్లలో కొంత వెనక్కు ఇవ్వడం అప్పటి మీడియాలో హైలైట్ గా నిలిచింది. నిర్మాతలకు ఇలాంటి చర్యల ద్వారా ఉపశమనం కలిగించినప్పుడు మరిన్ని సినిమాలు తీసేందుకు ధైర్యం వస్తుంది.

# అరుదైన కలయికకు 'లైఫ్' ఇస్తుందా



మూవీ లవర్స్ ఎదురు చూస్తున్న బిగ్ డే వచ్చేసింది. కమల్ హాసన్, దర్శకుడు మణిరత్నం కలయికలో రూపొందిన థగ్ లైఫ్ ఇవాళ థియేటర్లలో అడుగు పెట్టింది. కర్ణాటక భాషకు సంబంధించి కమల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో ఆ రాష్ట్రంలో నిషేధం విధించడంతో దీని మీద ఫోకస్ మరింత పెరిగింది. నాయకుడు లాంటి ఎవర్ గ్రీన్ క్లాసిక్ వచ్చిన 38 సంవత్సరాల తర్వాత రిపీటైన కాంబో కావడంతో అభిమానుల్లో ఓ రేంజ్ లో అంచనాలున్నాయి. అడ్వాన్స్ బుకింగ్స్ విక్రమ్ స్థాయిలో లేకపోయినా ఈ మధ్య కాలంలో సౌత్ సినిమాల పరంగా ఎక్కువ ట్రెండ్ అయిన మూవీ ఇదేనని చెప్పాలి. యుఎస్ ప్రీమియర్ల నుంచి మిశ్రమ స్పందన వినిపిస్తున్న నేపథ్యంలో ఇండియా టాక్ ఎలా ఉండబోతోందనేది కీలకం కాబోతోంది. తెలుగు వరకు ఏమంత బజ్ కనిపించకపోవడం కొంత ఆందోళన కలిగించే విషయమే కానీ విక్రమ్ లాగా రెస్పాన్స్ వస్తే అమాంతం పికప్ చూడొచ్చు. పైగా బాక్సాఫీస్ ఖాళీగానే ఉంది. చెప్పుకోదగ్గ పోటీ లేదు. ఈ అవకాశాన్ని వాడుకుంటే భారీ వసూళ్లు చూడొచ్చు. మూడు దశాబ్దాల ఎదురు చూపులకు బ్రేక్ వేస్తూ కమల్ మణిరత్నం కలవడం బాగుంది కానీ ఇంత అంచనాలను ఏ మేరకు తట్టుకుంటుందనేది వేచి చూడాలి. ఏఆర్ రెహమాన్ సంగీతం కోసం చూస్తున్న ఫ్యాన్స్ భారీగానే ఉన్నారు. కర్ణాటక వివాదంలో క్షమాపణ చెప్పకుండా చాలా దూరం తీసుకెళ్లిన కమల్ హాసన్ కు ఆ రాష్ట్రంలో బ్యాన్ కావడం వల్ల జరిగిన నష్టం వాళ్ళకేనని నిరూపించాలంటే ఇది బ్లాక్ బస్టర్ కావాలి. లేదంటే రివర్స్ లో ట్రోలింగ్ లాంటివి చవి చూడాల్సి రావొచ్చు. త్రిష, అభిరామి, శింబు, అశోక్ సెల్వన్, నాజర్ లాంటి క్యాస్టింగ్ హైప్ ని పెంచింది.

## మంచు విష్ణుని టార్చర్ పెట్టిన విఎఫ్ఎక్స్



జూన్ 27 విడుదల కాబోతున్న కన్నప్ప కోసం ప్రమోషన్ల పరంగా విష్ణు అన్ని అస్త్రాలను వాడబోతున్నాడు. హరిహర వీరమల్లు వాయిదా వార్తల నేపథ్యంలో మళ్ళీ ఏమైనా మార్పు ఉండొచ్చేమోననే ఊహాగానాలకు చెక్ పెడుతూ అలాంటిదేమీ లేదని, ఈసారి టైంకి రావడం పక్కాని హామీ ఇస్తున్నాడు. త్వరలోనే ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభాస్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని సమాచారం. ఇదిలా ఉండగా కన్నప్ప ప్రమోషన్ల సందర్భంగా మంచు విష్ణు చెబుతున్న సంగతులు ఆసక్తికరంగా ఉన్నాయి. ముఖ్యంగా విఎఫ్ఎక్స్ గురించి షాకింగ్ అనిపించేలా కొన్ని విషయాలు చెప్పాడు.కన్నప్ప విజువల్ ఎఫెక్ట్స్ విష్ణుని తీవ్రమైన టార్చర్ పెట్టాయి. అసమర్థుడైన ఒక సూపర్ వైజర్ ని పెట్టుకోవడం వల్ల ప్రాజెక్టు ఏకంగా ఏడాది ఆలస్యమైపోయింది. అప్పుడే తాను చేస్తున్న పొరపాటు ఏంటో విష్ణుకి అర్థమైపోయింది. ఆ తర్వాత ముంబై, చెన్నై, హైదరాబాద్ తో పాటు విదేశాల సంస్థలు కలిపి మొత్తం ఎనిమిది కంపెనీలకు ఈ పనులు అప్పజెప్పాడు. ఈ ఇష్యూ వల్ల విఎఫ్ఎక్స్ నిపుణుల అవసరం చాలా ఉందని గుర్తించిన విష్ణు త్వరలో మోహన్ బాబు యూనివర్సిటీలో మూడు సంవత్సరాల సిజికి సంబంధించిన డిగ్రీ కోర్సుని ప్రారంభించబోతున్నారు. దీని వల్ల నిపుణుల కొరత కొంతైనా తగ్గించవచ్చని ప్లాన్. విఎఫెక్స్ వల్ల జరిగిన నష్టమే సుమారు 15 నుంచి 20 కోట్ల దాకా ఉండొచ్చని విష్ణు చెబుతున్న మాట. ప్రభాస్, మోహన్ లాల్, అక్షయ్ కుమార్, కాజల్ అగార్వల్, శరత్ కుమార్ లాంటి క్రేజీ క్యాస్టింగ్ తో పాటు మోహన్ బాబు ప్రత్యేక పాత్ర పోషిస్తున్న కన్నప్ప థియేటర్ లో చూశాక మర్చిపోలేని ఎక్స్ పీరియన్స్ ఇస్తుందని విష్ణు భరోసా ఇస్తున్నాడు.

## నిత్యావసరాల వితరణ సరుకులు పంపిణీ చేసిన జెపిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఇడుపుల రాజు



జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) మండలంలోని భోజ్యాతండా గ్రామ పంచాయతీ పుల్లుడు తండాకు బాదావత్ శాంతి ఇటీవల ఓ ప్రమాదంలో గాయపడి నడవలేని స్థితిలో మంచానికే పరిమితమైంది. బాధితురాలు శాంతికి జేపీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నిత్యావ సర సరుకులను, మరియు మెడిసిన్ కి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబానికి అండగా ఉంటామని , పిల్లల చదువు విషయంలో సహాయం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పవన్ , సాయి, ఉదయ్, రాకేష్ పాల్గొన్నారు.

# నిరుపేదల సొంతింటి కల సాకారదిశగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కృషి

**- కాంగ్రెస్ పార్టీ రూరల్ మండలాధ్యక్షులు : వకులాభరణం శ్రీనివాస్**

**- లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ నిర్వహించిన అధికారులు, నాయకులు**

**వేములవాడ, (ప్రశ్న న్యూస్)** నిరుపేదల సొంతింటి ఇల్లు కలను సాకారం చేసే దిశగా కాంగ్రెస్పార్టీ ప్రభుత్వం కృషి చేస్తోందని వేములవాడ రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వకుళ భరణం శ్రీనివాస్ అన్నారు.వేములవాడ రూరల్ మండలంలోని నూకలమర్రి గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులు భూమిపూజ కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా వకులాభరణం శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవారికి ఇండ్లు మంజూరు చేసి పేదల పక్షపాతిగా ప్రజాప్రభుత్వం నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. సబ్బండవర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని, ముఖ్యంగా ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు.

**- ఇల్లు మంజూరైన లబ్ధిదారుల ఆనందం:**

ఈ సందర్భంగా పోతు పద్మ, మల్యాల అనూష తర్ర పద్మ లబ్ధిదారులు మాట్లాడుతూ గత పదేళ్లుగా సొంత ఇల్లు కల నెరవేరలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 18 నెలల్లోనే ఇల్లు మంజూరు కావడం సంతోషకరమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**- హాజరైన ముఖ్యులు:**

ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాలకుర్తి



పరశురాములు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రోమాల ప్రవీణ్ కుమార్, గ్రామ కార్యదర్శి రమ,ఇందిరమ్మ కమిటీ సభ్యులు పోత్తూరి నర్సయ్య, పొట్ల మధు, దొంతుల సంజీవ్, మాజీ సర్పంచ్ పిట్టల వెంకటేష్, నాయకులు నాగుల మల్లయ్య, సామల్ల రాజు, బొడ్డు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ కు వినతి



మేడ్చల్( ప్రశ్న న్యూస్) ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో సమాచార హక్కు చట్టం బోర్డులను ఏర్పాటు చేయాలని టీం ఫర్ గుడ్ గవర్నెన్స్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తలారి చందర్ కోరారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకొని టీం ఫర్ గుడ్ గవర్నెన్స్ సొసైటీ సభ్యులు ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ నిత్యానందన్ ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు తలారి చందర్ మాట్లాడుతూ ఆయా వార్డులో మ్యానువల్ 17 అంశాల సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీం ఫర్ గుడ్ గవర్నెన్స్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి వంశీకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి రమేష్ గుప్తా, మండల అధ్యక్షులు ఎండి ఆజాం ప్రతినిధులు పాల్గొన్నారు.

# "4"దశాబ్దాల నిరీక్షణకు తెర, "3"తరాల జీవితాల్లో వెలుగులు

**- నలభై ఏళ్ల పోరాటం,కోర్టు సూచనతో న్యాయం**

**- కష్టాల కడలి నుంచి వడ్డున పడ్డ ప్రాగ హౌసింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ**

**- 1984 లో ప్రాగ హౌసింగ్ కో-అపరేటివ్ సొసైటీ పేరుతో రిజిస్ట్రేషన్.మొత్తం సభ్యులు "176"**

**మొత్తం "18: ఎకరాల 12 గుంటల స్థలంలో కాలక్రమేణా వివిధ కారణాల వల్ల కొంత భూమి అన్యాక్రాంతం, మిగిలినది"10: ఎకరాల 23 గుంటల స్థలం**

**- "40" సంవత్సరం సుదీర్ఘ పోరాట ఫలితమే రేపటి ఆశ**

**- తెలంగాణ ఉన్నత న్యాయస్థానం సర్వే చేసి నివేదిక అప్పజేప్పాలన్నారు**

**- మేడ్చల్ జిల్లా బాలానగర్ రెవెన్యూ అధికారులు, కోర్టు నజారత్ అధికారుల సమక్షంలో సర్వే నిర్వహించారు**




కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భూముల విలువలు నగర్ శివార్లలో అంతంతమాత్రంగా ఉండడంతో ఉద్యోగ సంఘాలు, సొసైటీలు భూములను కొనుగోలు చేసి సొసైటీల పేరుతో రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఇవన్నీ 1980 నుండి 95 వరకు రంగారెడ్డి జిల్లాలో కొన్ని వేల సొసైటీల ద్వారా భూ రిజిస్ట్రేషన్లు జరిగిన విషయం అందరికీ తెలిసిందే.కానీ కాలక్రమమైన భూముల ధరలు అమాంతం ఆకాశాన్ని అంటడంతో విక్రయాలు జరిపిన భూ యజమానుల దురాశతో పదేపదే అదే స్థలాన్ని విక్రయించి సొమ్ము చేసుకున్న దాఖలాలు కోకొల్లలు.. అదే మాదిరిగా గ్రూప్ డి నుండి కొనుగోలు చేసిన ఉద్యోగులు లబోదిభోమంటూ సొసైటీ ద్వారా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయినప్పటికీ రంగారెడ్డి జిల్లా ప్రాంతంలో కొన్ని వందల సొసైటీలో నిర్వీర్యం అయిపోయి భూవివాదాల్లో చిక్కుకున్నాయి. ఈ నేపథ్యంలో అప్పటి రంగారెడ్డి జిల్లాకు చెందిన బాలానగర్ మండల పరిధిలో సర్వేనెంబర్ 35, 36 లో 18 ఎకరాల 12 గంటల భూ వివాదం గత నలభై వేల నుండి ప్రాగ హౌసింగ్ కోఆపరేటివ్ సొసైటీ న్యాయస్థానంలో పోరాడుతూ చిట్టచివరికి నిన్న ఒక కొలిక్కి వచ్చింది. ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు బాలానగర్ మండల రెవెన్యూ అధికారులు బోయిన్ పల్లి పోలీసుల సహకారంతో సర్వే పంచనామా మొదలైంది. సికింద్రాబాద్ ఓల్డ్ బోయిన్ పల్లి ఆర్ ఆర్ నగర్ లో ఉన్న ప్రాగ హౌసింగ్ కో-అపరేటివ్ సొసైటీ.ఈ సొసైటీ 1984 లో కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న "ప్రాగ టూల్స్"లో ఉద్యోగులు "176"మంది సభ్యులతో ప్రాగ హౌసింగ్



కో-అపరేటివ్ సొసైటీ పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. ఈ నేపథ్యంలో అంతా బాగుంది అనుకున్న సమయంలో సర్వే నెంబర్ "35,36 లో సుమారు"18:ఎకరాల 12:గుంటల స్థలం 1984 లో అప్పటి భూ యజమానులు "ప్రాగ హౌసింగ్ కో-అపరేటివ్ సొసైటీ పేరుతో రిజిస్ట్రేషన్ అయిన విషయం వెల్లడించారు.అయితే అసలు విషయం ఏమిటంటే ఈ భూమికి ఆనుకొని ఉన్న యాజమానులు మాది అంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఇదే విధంగా మరి కొందరు ప్రాగ హౌసింగ్ కో-అపరేటివ్ సొసైటీ సభ్యులను నానారకాలుగా ఇబ్బందులకు గురి చేసిన విషయం విదితమే! కానీ మరో విషయం ఏమిటంటే ప్రాగ టూల్స్ లో ఉద్యోగం చేస్తూ బ్యాంకు నుంచి లోన్ తీసుకుని సొంతింటి కళ కోసం అప్పు చేసి మరి కొంటె కొంతమంది అస్మదీయులు మాటలతో చెప్పలేనని సమస్యలు సృష్టించారని,అలాగే ఇదిగో అదిగో అంటూ గాల్లో దీపం లాఎదురు చూస్తున్న మాకు ఈతెలంగాణ ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల మేరకు నిన్న గురువారం ఉదయం సర్వే నెంబర్ 35 36 లో సర్వే నిర్వహించారు.ఈ కళ సాకారం మైతున్న నేపథ్యంలో సహోద్యోగులు ఆశ అడియాశలు అవుతున్నాయని ఆవేదనతో చనిపోయిన విషయం విలేకరులతో పంచుకున్నారు.అలాగే ఈ ప్రాగ హౌసింగ్ కో-అపరేటివ్ సొసైటీలో "18: ఎకరాల 12:గుంటల స్థలంలో కాలక్రమేణా వివిధ కోణాల్లో కబ్జాకి గురైనట్లు ప్రాగ హౌసింగ్ కో-అపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి పేర్కొన్నారు.కానీ మా నిజాయితీ,ఓపిక,కష్టం, అదృష్టం అన్ని తోడైనాయి.ఎది ఏమైనా సర్వేలో వెల్లడైన స్థలంతోనే మున్సిపల్ అధికారుల సహాయ సహకారంతో అనుమతులు తీసుకొని మా ప్రాగ హౌసింగ్ కో-అపరేటివ్ సొసైటీ సభ్యులు కళ నెరవేర్చుకుంటామని మరోసారి ముక్తకంఠంతో వెల్లడించారు అధ్యక్షుడు.మా నలభై ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితమే రేపటి ఆశ నిజమైతుంది. ముఖ్యంగా చట్టం పై పూర్తి నమ్మకం ఉంది కాబట్టే ఈ రోజు మా గెలుపు సాధ్యం అయ్యిందన్నారు సొసైటి సభ్యులు. మూడుతరాల పోరాటమే నలభై ఏళ్ల కళ సాకారం అవుతుందని ప్రాగ హౌసింగ్ కో-అపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి తెలిపారు.అలాగే ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సర్వే నాలుగింటికి ముగిసిన్నట్లు సమాచారం. ఈ సర్వేలో బాలానగర్ రెవెన్యూ అధికారులు, బోయిన్ పల్లి పోలీసులు సహాయ సహకారంతో సర్వే నిర్విఘ్నంగా పూర్తైన్నట్లు మోహన్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రాగ హౌసింగ్ కో-అపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు దయానంద్, ట్రెజరర్ ఎన్.ఎస్.రాజు, సభ్యులు శంకర్రావు, లక్ష్మణ్ కుమార్, శ్రీనివాస్, శివాజీ, జగన్ మోహన్ రెడ్డి, కుమారస్వామి, అపర్ణదేవి ,జాక్యి సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న కోడెల సంక్షేమం కోసం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేక పర్యవేక్షణ

**- గోశాలలో పనిచేసేందుకు వర్కర్ల నియామకానికి చర్యలు**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి చెందిన తిప్పాపూర్ గోశాలలో కోడెల ఆరోగ్య పరిస్థితిని, షెడ్ల నిర్మాణాలను రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం ఆకస్మికంగా క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. గోశాలలో పారిశుధ్యాన్ని మెరుగుపరచేందుకు అదనపు వర్కర్ల నియామకానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కోడెలకు అందిస్తున్న వైద్య సేవలు, దాణా, పచ్చిగడ్డి, తాగునీటి పరిరక్షణను పరిశీలించి తగిన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ వినోద్ రెడ్డి, పశువైద్యులు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భూభారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**-జిల్లా కలెక్టర్ : సందీప్ కుమార్ ఝా**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ రూరల్ మండలంలోని హనుమాజీపేట గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. జూన్ 3 నుంచి 20 వరకు జిల్లాలోని ప్రతీ మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, భూములపై సమస్యల నివారణకు ప్రభుత్వ చట్టాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. మనిషికి ఆధార్ ఉన్నట్లే భూమికి భూ దార్ నంబర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. హనుమాజీపేట రైతు వేదికలో జరిగిన రెవెన్యూ భూ సదస్సులో తహసీల్దార్ అబుబాకర్, రైతులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వచ్చిన భూ దరఖాస్తులను పరిశీలించి, అవసరమైన సూచనలు, సూచనలతో అధికారులు స్పందించారని కలెక్టర్ పేర్కొన్నారు.

## శివ దుర్గా ఎల్లమ్మ తల్లి ముఖద్వారం ప్రారంభోత్సవం




కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ ఓల్డ్ బోయిన్ పల్లి హస్మత్ పేట్ చౌరస్తాలో నూతనంగా నిర్మించిన శివ దుర్గ ఎల్లమ్మ తల్లి సమేత దేవాలయంలో ముఖ ద్వార మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు.టి కాంగ్రెస్ టీపీసీసీ సెక్రటరీ దండుగుల యాదగిరి గత 10 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఆలయం నిర్మిస్తానని మొక్కిన నేపథ్యంలో ఇటీవల ఆలయ నిర్మాణం కోసం తన సొంత నిధులతో 23 లక్షల ఖర్చుతో ఆలయ నిర్మాణాన్ని చేపట్టాడు.ఈ నేపథ్యంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన శిల్పులతో ముఖద్వారాలు తీర్చిదిద్ది వాటిని నిన్న గురువారం తెల్లవారుజాము నుంచి యజ్ఞ హోమాధి కార్యక్రమాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి ముఖద్వారాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ , మాజీ కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు, టిపిసిసి సెక్రటరీ సనత్ నగర్ ఇన్చార్జి కోట నీలిమ,కూకట్ పల్లి కాంగ్రెస్ ఇన్చార్జి బండి రమేష్,కంటోన్మెంట్ సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలు భానుకా నర్మదా మల్లికార్జున్ దంపతులు, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు గౌడ్, బోయిన్ పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్,స్థానిక కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. అమ్మవారి ఆలయ ముఖ ద్వారాన్ని ప్రారంభించడం సంతోషాన్ని కలిగించిందని నాయకులు తెలిపారు.

## ఎరువులు, విత్తనాల అమ్మకాలు నిబంధనల ప్రకారమే జరగాలి

**- జిల్లా కలెక్టర్: సందీప్ కుమార్ ఝా హెచ్చరిక**

**- శ్రీ లక్ష్మీ ట్రేడర్స్ అమ్మకాలకు నోటీసులు - నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎరువులు, విత్తనాలు నిబంధనల ప్రకారమే విక్రయించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. గురువారం వేములవాడ పట్టణంలో ఉన్న హనుమాన్ ఎంటర్ప్రైజెస్, శ్రీ లక్ష్మీ ట్రేడర్స్ వంటి ఎరువులు, విత్తనాల దుకాణాలు, గోదాములను ఆయన ఆకస్మికంగా క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ దుకాణాల్లో విత్తనాల నాణ్యతను పరిశీలించారు. శ్రీ లక్ష్మీ ట్రేడర్స్లో సేల్స్ రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్ మధ్య తేడా కనిపించడంతో అమ్మకాల నిలిపివేతకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లిస్టాక్లో చూపిన ఎరువులు గోదాములో లేకపోవడం గమనార్హం. సరైన వివరణ ఇవ్వకపోతే దుకాణాన్ని సీజ్ చేస్తామని వ్యవసాయ అధికారిని ఆదేశించారు.

**- కలెక్టర్ హెచ్చరిస్తూ**



రైతులకు నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. నాణ్యమైన విత్తనాలు మాత్రమే రైతులకు అందించాలని, కృత్రిమ కొరత సృష్టించినా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జలి బేగం, ఇతర సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్లో హైడ్రా కమీషనర్ రంగనాథన్ పర్యటన

**- సికింద్రాబాద్, బేగంపేట, పాట్నీ నాలా పరిశీలన**

**- నాలాపై అక్రమ నిర్మాణాలు తొలగిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం**

**- నగరంలో నాలాల కబ్జాతో రోడ్ల పైకి వర్షపు నీరు**





కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో హైడ్రా కమీషనర్ రంగనాథన్ కి రోజు రోజుకీ కంప్లైంట్స్ సంఖ్య పెరిగిపోతున్నాయి. నెటిజన్ల ఫిర్యాదులే హైడ్రా యంత్రాంగం ఉరుకులు పరుగులు పెడుతున్నాయి. అదిగాక రాబోయేది వర్షాకాలం చాలా సీరియస్ గా ఉన్నారు హైడ్రా కమీషనర్ రంగనాథన్. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ బేగంపేట ప్యాట్నీ నాలాను హైడ్రా కమిషనర్ రంగనాథ్, కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్, జిహెచ్ఎంసి అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. ప్యాట్నీ నాలా వద్ద క్షేత్రస్థాయిలో పర్యటించి వర్షాకాలంలో తలెత్తుతున్న సమస్యను స్థానికుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. వర్షాకాలం వస్తే నాలాల నుండి కాలనీల్లోకి వరద నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు హైడ్రా దృష్టికి ఈ సమస్యను తీసుకువచ్చినట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. వర్షాకాలంలో మోకాళ్ళ లోతు నీరు కాలనీలలో ప్రవహించడం మూలంగా తమకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ప్రజల నుండి ఫిర్యాదులు రావడంతో నాలాను పరిశీలించినట్లు తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నాలాల పై ఉన్న ఆక్రమణలను హైడ్రా గుర్తించిందని తెలిపారు. నాలా విస్తీర్ణం కూడా చిన్నగా ఉండడం మూలంగా ఇలాంటి సమస్య తలెత్తుతున్నట్లు తెలిపారు. నాలా పరివాహక ప్రాంతాలలో ఆక్రమణలను తొలగించేందుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వర్షాకాలంలో కాలనీలలో నాలా పరివాహక ప్రాంతాలు నీట మునిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తమ దృష్టికి వచ్చిన తరుణంలో హైడ్రా కంటోన్మెంట్ జిహెచ్ఎంసి యంత్రాంగంతో కలిసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. మధుకర్ నాయక్ సిఇవో: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న పైగా కాలనీ హుమయిన్ నగర్ పరిసర ప్రాంతాల వారు వర్షాకాలం వస్తే చాలు ఇండ్లల్లోకి వర్షం నీళ్ళు వస్తున్నాయని ఫిర్యాదు రావడంతో,అలాగే నాలాలు పై అక్రమ నిర్మాణాలు ఉన్నాయని గత కొన్ని సంవత్సరాలుగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాము. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో హైడ్రా సంస్థ కొత్తగా కొలువుదీరింది కాబట్టి అందుకనే హైడ్రా కమీషనర్ రంగనాథన్ కి ఫిర్యాదు చేశాం.

నిన్న గురువారం సాయంత్రం 4: గంటల సమయంలో రంగనాథన్ తో పాటు సిఇవో మధుకర్ నాయక్ అక్రమానికి గురైన నాలను పరివేక్షించారు. అదిగాక నాలాలు రాష్ట్ర రెవెన్యూ పరిగణనలోకి వస్తాయి కాబట్టి హైడ్రా టీం, జిహెచ్ఎంసి, రెవెన్యూ అధికారులు పరివేక్షించారు వీలైనంత త్వరగా ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు కంటోన్మెంట్ సిఇవో మధుకర్ నాయక్. ఈ కార్యక్రమంలో ఉత్తర మండల జోనల్ కమీషనర్ ఎన్.రవికిరణ్, కంటోన్మెంట్ చీఫ్ ప్లానర్ ఫణి కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ శివాజీ, శానిటేషన్ ఇన్స్పెక్టర్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

# రిపోర్టర్లు చెప్పిందే జరిగింది

## - తార్నాక జంక్షన్ మూసివేతకు నిర్ణయం

- ప్రజల సమస్యలపై అధికారుల కంటే ముందుగానే విశ్లేషించేది రిపోర్టర్లే
- తార్నాక చౌరస్తా పై వాస్తవలు పత్రికల్లో కధనాలు వచ్చిన పట్టించుకోని అధికారులు, పాలకులు
- ప్రజల సమస్యలపై రిపోర్టర్ల కంటే అధికారులకు పాలకులకు అవగాహన తక్కువ నేనా.?
- ఎట్టకేలకు తార్నాక చౌరస్తా కష్టాలు తీరినట్లే మరి హబ్సిగూడ చౌరస్తా పరిస్థితి ఏమిటో.?



**తార్నాక (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వాధికారులు ఒక పనిని ఎందుకు ప్రారంభిస్తారో ఎందుకు మధ్యలో వదిలేస్తారో వాళ్లకె తెలుస్తుంది ప్రజలకు అసలు అర్థం కాదు. కొంతమంది అధికారులు అయితే తాము చెప్పిందే వేదం ప్రజలు ఏమి చెప్పినా వాళ్లకు పట్టదు వాళ్ళు చేయాల్సింది చేసేస్తారు దానితో ప్రజలకు ఇబ్బంది కలుగుతుందా లేదా, నష్టం వస్తుందా అన్నది కూడా వాళ్ల పరిగణంలోకి తీసుకోరు వాళ్లకు ఒకటే తెలుసు మేము చెప్పిందే కరెక్ట్ ఎందుకంటే మేము ఉన్నత అధికారులం అన్నట్లుగా వ్యవహరిస్తారు. ప్రస్తుతం తార్నాక చౌరస్తా పరిస్థితి కూడా అలాగే అయ్యింది. గతంలో తార్నాక చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య చాలా తీవ్రంగా ఉండేది దానిని సరి చేయడానికి అప్పట్లో ట్రాఫిక్ పోలీస్ అడిషనల్ కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకొని యూటర్న్ ఏర్పాటు చేశారు దానితో ట్రాఫిక్ సమస్య పూర్తిగా తీరిపోయింది. మరి గత ఆరు నెలల క్రితం ఏ అధికారికో లేక ఏ ప్రజాప్రతినిధికో తార్నాక చౌరస్తా ప్రారంభించాలని అనిపించిందో కానీ దానివల్ల ఖర్చు వృధా, సమయం వృధా, వాహనాదారుల అవస్థలు అన్ని ఇన్ని కావు తార్నాక చౌరస్తాను తిరిగి ప్రారంభిస్తామని జూన్ 5న పోలీసులు ప్రకటించినారు. స్థానికంగా ఉన్న జర్నలిస్టులు సిగ్నల్ ప్రారంభించిన తరువాత సమస్యపై ప్రజల అభిప్రాయాలను వాస్తవాలను పలుమార్లు పత్రికలో కథనాలు రాశారు. అయిన ఒక్క అధికారి, ప్రజా ప్రతినిధి కూడా స్పందించలేదు పట్టించుకోలేదు. రిపోర్టర్లకు ఏం తెలుసు అంతా మాకే తెలుసు అన్నట్లుగా వ్యవహరించారు



PRESS NOTE

&&&

On 18-04-2025, the **Tarnaka Junction** under the flyover was re-opened for vehicular movement to facilitate travel between Osmania University and Lalapet and vice versa on trial basis.

During the trial period, we have conducted simulative studies, drone study, analyzed google data, tried different traffic signal timings, studied road engineering aspects at the junction apart from taking feedback from the commuters.

All the above studies indicated that it is not feasible to keep open the Tarnaka Junction under the flyover and advisable to close the junction to ease out traffic congestion, avoid road accidents and in the interest and safety of common road users.

In view of the above, all citizens are requested to take note that Tarnaka Junction under the flyover will be closed **w.e.f. 06-06-2025**

Jt. Commissioner of Police,
Traffic, Hyderabad.

చివరకు వాహనాదారుల నుండి స్థానిక ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. సిగ్నల్ పడడంతో నిమిషాలకొద్దీ వాహనాలు ఆగిపోయి తార్నాక సెంటెన్స్ స్కూల్ వరకు హెచ్ఎండిఏ కార్యాలయం వరకు ఇటు రైల్వే డిగ్రీ కాలేజీ వరకు అటు ఓయూ పోలీస్ స్టేషన్ మనికేశ్వర్ నగర్ వరకు జామ్ కావడంతో వాహనాదారుల అవస్థలు అన్నీ ఇన్ని కావు అయిన ట్రాఫిక్ పోలీసులు తగ్గేదేలే అన్నట్లుగా అలానే కొనసాగించారు. దానితో స్థానిక రిపోర్టర్లు పలుమార్లు సమస్యను పత్రికాముఖంగా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు అయిన పట్టించుకోలేదు. ఒక్కసారిగా ఏం జరిగిందో ఏ అధికారికి వాస్తవనిజం అర్థమయిందో తెలియదు తార్నాక చౌరస్తా మూసివేస్తామని ప్రకటించడంతో వాహనదారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ చౌరస్తా ప్రారంభించడం వలన వాహనాలతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి చాలా పొల్యూషన్ సమస్య ఏర్పడింది ఇక ఈ చౌరస్తాను శాశ్వతంగా మూసివేస్తేనే సమస్య పరిష్కారం అవుతుందని అధికారుల ఆలోచనతో జూన్ 6వ తేదీ నుండి తార్నాక చౌరస్తాను తాత్కాలికంగా మూసివేస్తామని ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ముందుగానే స్థానిక జర్నలిస్టులు రాసిన కథనాలపై ఉన్నత అధికారులు పర్యవేక్షణ చేసి వాస్తవాలను తెలుసుకొని ఉంటే వాహనాదారులకు ఇన్ని అవస్థలు వచ్చేవి కావు ప్రభుత్వానికి ఇంత వృధా ఖర్చు అయ్యేది కాదు. ఏది ఏమైనా సమాజంలో జరిగే అవినీతి అక్రమాలను, ప్రజల సమస్యలను అధికారుల కంటే ముందే గుర్తించి సమాజానికి తెలిపేది జర్నలిస్టులే అని అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా అర్థం చేసుకుంటే చాలా సమస్యలు తీరిపోతాయి అవినీతి అక్రమాలు కట్టడి అవుతాయి.

# శభాష్ మేడ్చల్ ట్రాఫిక్ సిఐ హనుమాన్ గౌడ్

**- రోడ్డుపై పడ్డ గుంతలను దగ్గరుండి పూడ్చి వేయించిన ట్రాఫిక్ సిఐ**

**- ట్రాఫిక్ సిఐ హనుమాన్ గౌడ్ తీరుపై ప్రయాణికుల ప్రశంస జల్లులు**



**మేడ్చల్ ( ప్రశ్న న్యూస్)** మున్సిపల్ అధికారులు చేయవలసిన విధులు కూడా ట్రాఫిక్ పోలీసులు నిర్వహించడం వల్ల బాధ్యతారహిత్యానికి నిదర్శనంగా మారింది. ప్రమాదాలు జరుగుతున్న తీరుపై బాధపడి సాక్షాత్ ట్రాఫిక్ సిఐ రంగంలోకి దిగి గుంతలు పూడ్చి వేయించడం చూస్తుంటే మున్సిపల్ అధికారులు డ్యూటీ చేయడం పూర్తిగా బంద్ చేశారని అర్థమవుతుంది. ట్రాఫిక్ ను కంట్రోల్ చేయడమే కాదు ప్రజాసేవ సైతం చేయగలమని నిరూపించారు మేడ్చల్ ట్రాఫిక్ సిఐ హనుమాన్ గౌడ్. ట్రాఫిక్ రూల్స్ ను పాటించని ప్రయాణికులపై కొరడా విధించడమే కాదు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం కూడా మా బాధ్యత అని మేడ్చల్ ట్రాఫిక్ సీఐ హనుమాన్ గౌడ్ నిరూపించారు. రోడ్డుపై పడ్డ గుంతలను ట్రాఫిక్ సిఐ హనుమాన్ గౌడ్ స్వయంగా దగ్గరుండి మట్టితో పూడ్చి వేయించిన ఘటన మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. కిష్టాపూర్ గ్రామంలో రోడ్డు మధ్యలో గుంత ఏర్పడి ప్రయాణికులకు ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు ఇబ్బంది కలుగుతూ ఉండడం మేడ్చల్ ట్రాఫిక్ సిఐ హనుమాన్ గౌడ్ దృష్టికి రాగా ట్రాఫిక్ సిఐ హనుమాన్ గౌడ్ స్వయంగా దగ్గరుండి మరమ్మతులు చేయించారు. దీనిని చూసినా ప్రయాణికులు ట్రాఫిక్ సిఐ హనుమాన్ గౌడ్ పై ప్రశంస జల్లులు కురిపించారు. మున్సిపల్ అధికారులు చేయాల్సిన పనిని ట్రాఫిక్ సిఐ హనుమాన్ గౌడ్ చేయడాన్ని ప్రయాణికులు ప్రశంసించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ హనుమాన్ గౌడ్ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించని ప్రయాణికులపై జరిమానాలు విధించడమే కాదు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం కూడా మా బాధ్యత అని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే రోడ్డుపై పడ్డ గుంతలను మట్టితో పూడ్చి వేయడం జరిగిందని తెలిపారు.

రాబోయేది వర్షాకాలం కావడం వల్ల గుంతలను ఇలానే వదిలేస్తే గుంతలు మరింత పెరిగి ప్రయాణికులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉన్నందున , స్వయంగా తానే దగ్గరుండి గుంతలను మట్టితో పూడ్చి వేయించారని ట్రాఫిక్ సిఐ హనుమాన్ గౌడ్ తెలిపారు.

## ప్రైవేట్ పాఠశాలలో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య కై జీవోను జారీ చేయాలి: సంతోష్ రాజ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్ )** తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య కై జీవోను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేయాలని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర సెక్రెటరీ సంతోష్ రాజ్ విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తూ ప్రజా సమస్యలను అధికారులకు ప్రజా ప్రతినిధులకు తెలుపుతూ వారధిగా ఎప్పటికప్పుడు సమస్యలను దినపత్రికల్లో ప్రచురిస్తూ సమస్యల పరిష్కారానికై కృషి చేస్తున్న జర్నలిస్టులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలో ఉచిత విద్యను అందించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీవోను విడుదల చేయాలని కోరారు.

# భద్రతలో స్వయం సమృద్ధి సాధించాలి

## - ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

- దేశ భద్రతలో స్వయం సమృద్ధి చాలా అవసరమని ఆర్ఎస్ఎస్ చీఫ్ ఉద్ఘాటన
- పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో కీలక వ్యాఖ్యలు
- ఉగ్రవాదుల దాడిలో అమాయకుల మృతిపై తీవ్ర ఆవేదన, ఆగ్రహం
- సమాజంలో శాశ్వత ఐక్యత, సామరస్యం ఉండాలని పిలుపు



**న్యూఢిల్లీ ప్రశ్నన్యూస్:** దేశ భద్రత విషయంలో పూర్తిస్థాయిలో స్వావలంబన సాధించాల్సిన అవసరం ఉందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ గురువారం స్పష్టం చేశారు. ఇటీవల పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి, అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పరిణామాల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇందుకుగాను నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని, పరిశోధనలు ముమ్మరం చేయాలని ఆయన సూచించారు. నాగ్‌పూర్‌లో జరిగిన కార్యకర్త వికాస్ వర్గ్ ముగింపు కార్యక్రమంలో మోహన్ భగవత్ ప్రసంగించారు. "పహల్గామ్ దాడిలో ఉగ్రవాదులు మన దేశంలోకి ప్రవేశించి అమాయక పౌరులను అత్యంత కిరాతకంగా చంపారు. ఈ ఘటన పట్ల తీవ్రమైన ఆవేదన, ఆగ్రహం వ్యక్తం కావడం సహజం. దోషులను కఠినంగా శిక్షించాలన్న బలమైన ఆకాంక్ష వ్యక్తమైంది. ప్రతిగా కొన్ని చర్యలు తీసుకున్నారు. మన సైన్యం ధైర్యసాహసాలు, సామర్థ్యాలు మరోసారి ప్రస్ఫుటమయ్యాయి. ప్రభుత్వ యంత్రాంగం పట్టుదల కూడా కనిపించింది. రాజకీయ వర్గాల్లోనూ పరస్పర అవగాహన వ్యక్తమైంది. సమాజం కూడా తన ఐక్యత సందేశాన్ని ఇచ్చింది. ఇది శాశ్వతంగా కొనసాగాలి" అని భగవత్ అన్నారు. దేశానికి నిజమైన బలం సమాజ బలమేనని, సమాజం అప్రమత్తంగా, ఐక్యంగా ఉండాలని ఆయన నొక్కిచెప్పారు. "పరస్పరం సామరస్యంతో, మంచి ఆలోచనలతో జీవించడం చాలా అవసరం" అని ఆయన తెలిపారు. సమాజంలోని వివిధ వర్గాల మధ్య ఘర్షణలు ఉండకూడదని, సామరస్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. "మనం ఒక దేశంగా ఒక్కటే, ఒక సమాజంగా ఒక్కటే. అనాదిగా వస్తున్న ఒకే సంస్కృతి ప్రవాహం మన ప్రవర్తనను నిర్దేశిస్తోంది" అని భగవత్ పేర్కొన్నారు. రెండు దేశాల సిద్ధాంతమనే భూతం ఉన్నంత కాలం ఉగ్రవాద ముప్పు పొంచి ఉంటుందని ఆర్ఎస్ఎస్ చీఫ్ హెచ్చరించారు. "శాంతియుతంగా జీవించాలనే ఉద్దేశంతో పాకిస్థాన్‌ను వేరు చేశారు. ముఖాముఖి యుద్ధంలో గెలవలేమని పాకిస్థాన్‌కు తెలుసు. అందుకే వారు పరోక్ష యుద్ధాన్ని ఎంచుకున్నారు, ఉగ్రవాద కార్యకలాపాలను ఉపయోగించుకున్నారు, ఉగ్రవాద సహకారంతో వేయి గాయాల విధానాన్ని అనుసరించారు. అయితే, ఇప్పుడు యుద్ధ రూపాలు మారాయి. డ్రోన్లు వదులుతున్నారు" అని ఆయన వివరించారు. ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేసే దేశాలు ఉన్నంతకాలం మనం అప్రమత్తంగా ఉండాలని భగవత్ వాదించారు.

"మనకు శత్రువులు లేరు, మనం సత్యం, అహింసలను అనుసరించేవారం" అని ఆయన అన్నారు. గతంలో, పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం మోహన్ భగవత్ మాట్లాడుతూ "భారత్ శక్తిమంతమైనదని నిరూపించాల్సిన సమయం ఆసన్నమైంది" అని వ్యాఖ్యానించారు. సరిహద్దుల్లో మతపరమైన ప్రదేశాలు, పౌర ప్రాంతాలపై పాకిస్థాన్ సైన్యం చేస్తున్న దాడులను ఆయన ఖండించారు. బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. "మన అన్ని సరిహద్దుల్లో దుష్ట శక్తుల దుర్మార్గాన్ని చూస్తున్నందున, మనం శక్తిమంతంగా ఉండటం తప్ప మరో మార్గం లేదు" అని అంతర్గత బలం ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు.

# సచివాలయంలో సొమ్మసిల్లి పడిపోయిన మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్ ప్రశ్నన్యూస్:** తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం నాడు అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. కేబినెట్ సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన ఆమె, సమావేశం ప్రారంభానికి ముందే కళ్లు తిరిగి పడిపోయారు. ఈ ఘటనతో సచివాలయ సిబ్బంది, అధికారులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే, మంత్రి కొండా సురేఖ ఉదయం నుంచి ఎలాంటి ఆహారం తీసుకోలేదని తెలిసింది. ఈ కారణంగానే ఆమె అస్వస్థతకు లోనై, సచివాలయంలోని తన ఛాంబర్ వద్దకు వెళుతుండగా సొమ్మసిల్లి పడిపోయినట్లు సమాచారం.

మంత్రికి షుగర్ లెవెల్స్ పెరిగాయని తెలిసింది. వెంటనే అప్రమత్తమైన మంత్రి వ్యక్తిగత సిబ్బంది ఆమెకు ప్రథమ చికిత్స అందించి, ఆహారం అందజేశారు. కాసేపటికి కొండా సురేఖ తేరుకున్నారు. ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగాల్సి ఉంది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు మంత్రులందరూ సచివాలయానికి చేరుకున్నారు. మంత్రి కొండా సురేఖ అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు వెంటనే ఆమె వద్దకు వెళ్లి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588